తెలంగాణ
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | శుక్రవారం-14- నవంబర్ 2025 | సంపుటి : 3 | సంచిక : 166 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

# డేటింగ్ యాప్‌లలో మోసాలపై జాగ్రత్త..

ప్రజలకు తెలంగాణ పోలీసుల కీలక హెచ్చరిక


వ్యక్తిగత వివరాలు పంచవద్దని పోలీసుల సూచనలు

ఫేక్ ప్రొఫైల్‌లతో మోసగాళ్ల కొత్త ఉచ్చులు

అనుమానం వచ్చిన వెంటనే 1930కి ఫిర్యాదు చేయండి

**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)**
డేటింగ్ యాప్‌ల వాడకం భారీగా పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ మోసాలు కూడా ఆందోళనకరంగా పెరుగుతున్నాయని తెలంగాణ పోలీసులు వెల్లడించారు. తెలియని వ్యక్తులతో వ్యక్తిగత వివరాలు, ఫోటోలు, బ్యాంకు సమాచారం పంచుకోవడం ప్రజలను పెద్ద ప్రమాదంలోకి నెట్టవచ్చని అధికారులు హెచ్చరిస్తున్నారు.

మిగతా 2లో






# ప్రపంచాన్ని ఆకట్టుకున్న సీఎం రేవంత్ రెడ్డి విజన్

- హైదరాబాద్.. గ్లోబల్ పెట్టుబడుల కొత్త రాజధాని
- మౌలిక వసతులు.. సురక్షిత వాతావరణం–యువత
- తెలంగాణకు పెట్టుబడుల పరంగా మూడు బల స్తంభాలు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**న్యూఢిల్లీ, నవంబర్ 13 (తెలంగాణ ముచ్చట్లు):** అమెరికా–భారతదేశ వ్యూహాత్మక భాగస్వామ్య వార్షిక సదస్సు వేదికగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రసంగం అంతర్జాతీయ వ్యాపార వర్గాల్లో విశేష స్పందన తెచ్చింది. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి పెట్టుబడిదారుల కోసం అత్యంత అనువైన నగరంగా తీర్చిదిద్దుతున్నామని, భౌగోళికంగా కేంద్రస్థానంలో ఉండడం, శాంతి భద్రతా వ్యవస్థ బలంగా ఉండడం, అత్యుత్తమ మౌలిక వసతులు కలిగి ఉండడం వంటి అంశాలు హైదరాబాద్‌ను అంతర్జాతీయ పెట్టుబడుల దిశగా ముందంజలో నిలబెడుతున్నాయని సీఎం స్పష్టం చేశారు.
తెలంగాణ దేశంలోనే అత్యధిక యువ జనాభా కలిగిన రాష్ట్రంగా, వేగవంతమైన వృద్ధి రేటును అందుకుంటున్న రాష్ట్రంగా నిలిచిందని తెలిపారు.

మిగతా 2లో

# ధాన్యం కొనుగోలు కేంద్రంపై మంత్రి తనిఖీ



- అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్న సమీక్ష
- రైతులకు న్యాయమైన ధర, పారదర్శక కొనుగోలు లక్ష్యంగా చర్యలు వేగవంతం చెయ్యలె: ఉత్తమ్ కుమార్ రెడ్డి

**సూర్యాపేట, నవంబర్ 13 (తెలంగాణ ముచ్చట్లు):**
గరిడేపల్లి మండలం గడ్డిపల్లిలో పనిచేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గురువారం ఆకస్మికంగా సందర్శించారు. రైతుల నుంచి కొనుగోలు చేస్తున్న ధాన్యం నాణ్యత, తేమశాతం, కొలత ప్రమాణాలు, నిల్వ విధానాలను మంత్రి ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు కేంద్రంలో జరుగుతున్న మొత్తం కొనుగోలు విధానాన్ని మంత్రి సమక్షంలో వివరించారు. రైతులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తమ ధాన్యం విక్రయించేందుకు అవసరమైన చర్యలు తక్షణం తీసుకోవాలని మంత్రి సూచించారు.

మిగతా 2లో



# గంధసిరిలో సుందర మౌలేశ్వరాలయ పునర్‌నిర్మాణానికి శంకుస్థాపన

కాకతీయుల యుగ వైభవాన్ని మళ్లీ వెలిగించే ప్రయత్నం

ప్రాంత అభివృద్ధికి పురాతన దేవాలయం కేంద్రంగా మారనున్న ఆశలు

తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**గంధసిరి, నవంబర్ 13(తెలంగాణ ముచ్చట్లు):**
ముదిగొండ మండలం గంధసిరి గ్రామంలో శతాబ్దాల చరిత్ర కలిగిన శ్రీ సుందర మౌలేశ్వరస్వామి దేవాలయ పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన ఘనంగా జరిగింది. తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్వయంగా హాజరై ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కాకతీయుల కాలం నాటి ఈ దేవాలయాన్ని మళ్లీ మహిమాన్వితంగా తీర్చిద్దేందుకు ప్రభుత్వం మొత్తం రూ.2 కోట్ల నిధులను కేటాయించింది.

మిగతా 2లో



# పాలేరు రిజర్వాయర్‌లో చేప పిల్లాల విడుదల

- మత్స్యకార కుటుంబాల జీవనోపాధికి ప్రభుత్వం అండగా నిలుస్తున్నామన్నమంత్రి పొంగులేటి
- రాష్ట్రవ్యాప్తంగా 101 రిజర్వాయర్లలో పెద్ద సైజు రొయ్య పిల్లల విడుదలకు సిద్ధం

**ఖమ్మం, (తెలంగాణ ముచ్చట్లు):**
ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గ పర్యటనలో భాగంగా పాలేరు రిజర్వాయర్‌లో చేప పిల్లలను విడుదల చేసినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. మత్స్య వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలకు ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తూ, వారి జీవనోపాధిని బలోపేతం చేస్తోందని ఆయన తెలిపారు. మత్స్యకార సంఘాల అభ్యర్థన

మిగతా 2లో





# నష్టాల్లో ఉన్న ఆర్టీసీ డిపోలను లాభాల్లోకి తెచ్చే కార్యాచరణ సిద్ధం

- రెవెన్యూ పెంపుపై మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులకు ఆదేశాలు
- కొత్త రూట్లు, డ్రైవర్ మానిటరింగ్ సిస్టమ్, కొత్త డిపోలు
- కీలక మార్పులపై దృష్టి

**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)**
రాష్ట్రంలో నష్టాల్లో నడుస్తున్న ఆర్టీసీ డిపోలను లాభాల్లోకి మారుస్తామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆర్టీసీ ఉన్నతాధికారులతో గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో శాఖ ఆదాయం పెంచే మార్గాలపై స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. సంస్థ ఆర్థిక స్థితిని బలోపేతం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని సూచించారు. ప్రముఖంగా, కొత్తగా ఏర్పడుతున్న కాలనీలకు బస్సు రూట్లను పెంచే అవకాశాలపై సమగ్ర అధ్యయనం చేయాలని మంత్రి ఆదేశించారు.

మిగతా 2లో

# తెలంగాణ వక్ఫ్ బోర్డు పనితీరు పై మంత్రి అజరుద్దీన్ సమీక్ష

- వక్ఫ్ ఆస్తులు, పరిపాలనా సంస్కరణలు ప్రధాన ప్రాధాన్యం
- బోర్డు పనితీరును బలోపేతం చేసేందుకు కీలక సూచనలు

**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)**
తెలంగాణ వక్ఫ్ బోర్డు పనితీరుపై సచివాలయంలో మంత్రి మహ్మద్ అజరుద్దీన్ సమీక్షా సమావేశం నిర్వహించారు. వక్ఫ్ ఆస్తుల సంరక్షణ, పరిపాలనా సామర్థ్యాన్ని పెంపొందించడం, బోర్డు కార్యకలాపాలను

మిగతా 2లో



# రైతుల సమస్యలపై కేంద్రానికి మంత్రి తుమ్మల లేఖ

- సోయాబీన్, మొక్కజొన్న, పత్తి కొనుగోళ్లలో సడలింపుల విజ్ఞప్తి
- 'మొంథా' తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులకు ప్రత్యేక రక్షణ కోరుతూ లేఖ

**హైదరాబాద్, నవంబర్ 13 (తెలంగాణ ముచ్చట్లు):**
తెలంగాణ రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో మంత్రి తుమ్మల నాగేశ్వర రావు కేంద్ర ప్రభుత్వానికి మరోసారి లేఖ రాసి అత్యవసర చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సోయాబీన్, మొక్కజొన్న,

మిగతా 3లో

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# ప్రపంచాన్ని ఆకట్టుకున్న సీఎం రేవంత్ రెడ్డి విజన్

(మొదటి పేజీ తరువాయి)



పెట్టుబడులకు, పరిశ్రమల పెట్టుబడిదారులకు గత 35 ఏళ్లుగా వివిధ ప్రభుత్వాలు మద్దతుగా నిలిచినట్లు గుర్తుచేస్తూ, అదే మార్గంలో పారదర్శకంగా తమ ప్రభుత్వం కూడా ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. "భారతదేశంలో పెట్టుబడులకై హైదరాబాదే ముఖద్వారం" అని సీఎం స్పష్టం చేశారు. గ్లోబల్ కంపెనీలకు జీసీసీల ప్రధాన గమ్యస్థానంగా హైదరాబాద్ ఇప్పటికే నిలుస్తున్నదని, ఇక్కడి వాతావరణం, మౌలిక వసతులు, సాంకేతిక నైపుణ్యం ఉన్న యువత ప్రపంచస్థాయిలో నగరానికి ప్రత్యేక గుర్తింపును తెచ్చాయని సీఎం వివరించారు. పారిశ్రామికవేత్తలు హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టాలని, వారి సంస్థలకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి భరోసాను అందిస్తుందని తెలిపారు.

మహిళా సాధికారత, నాణ్యమైన విద్య, నైపుణ్య శిక్షణ, ఆధునిక పట్టణ అభివృద్ధి ఈ నాలుగు అంశాలు తెలంగాణ అభివృద్ధి వ్యూహంలో కేంద్రబిందువులని సీఎం చెప్పారు. యువతకు గ్లోబల్ స్థాయి పోటీ సామర్థ్యం ఇవ్వడానికి ప్రభుత్వం అనేక నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోందని వివరించారు. హైదరాబాద్‌ను అత్యున్నత జీవన ప్రమాణాలతో కూడిన అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దాలని తన ప్రథమ ప్రాధాన్యతగా సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. 30 వేల ఎకరాల్లో అత్యాధునిక మౌలిక వసతులతో 'భారత్ ఫ్యూచర్ సిటీ' రూపుదిద్దుకుంటోందని, ఇది దేశంలోనే అత్యంత పెద్ద ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుల్లో ఒకటిగా నిలుస్తుందని తెలిపారు. మూసీ నది పునరుజ్జీవనం పూర్తయ్యాక లండన్, టోక్యో, దుబాయి, సియోల్ రివర్‌ఫ్రంట్‌ల మాదిరి హైదరాబాద్ నైట్ ఎకానమీ కొత్త దశలోకి ప్రవేశిస్తుందని సీఎం వివరించారు. డ్రై పోర్ట్, మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్, రేడియల్ రోడ్లు, ORR-RRR మధ్య మాన్యుఫ్యాక్చరింగ్ జోన్ వంటి కీలక మౌలిక వసతుల కల్పన రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి విస్తృత అవకాశాలు కల్పించనుందని తెలిపారు. "చైనా +1 మోడల్‌కు ప్రపంచానికి సమాధానం తెలంగాణ అవుతుంది" అని సీఎం ధైర్యంగా ప్రకటించారు. అగ్ర విద్యా సంస్థలు హార్వర్డ్, స్టాన్‌ఫోర్డ్, ఆక్స్‌ఫర్డ్ వంటి విశ్వవిద్యాలయాలు హైదరాబాద్‌లో ఆఫ్‌షోర్ క్యాంపస్‌లు ఏర్పాటు చేయాలని సీఎం ఆహ్వానం పలికారు. తక్కువ ఖర్చుతో విద్య, సులభ వీసా విధానాలు, గ్లోబల్ సౌత్ విద్యార్థులకు ఉన్నత విద్య అందించడానికి హైదరాబాద్ ఉత్తమ కేంద్రంగా మారగలదని వివరించారు.

సదస్సులో హైదరాబాద్ ప్రధాన రోడ్లకు 'గూగుల్ రోడ్', 'మెటా రోడ్', 'ఇన్ఫోసిస్ అవెన్యూ', 'టీసీఎస్ బులేవార్డ్' వంటి పేర్లు పెట్టే ప్రతిపాదనను సీఎం వెల్లడించడంతో పాల్గొన్న వ్యాపార సంస్థలు ఆసక్తిగా స్పందించాయి. విజన్‌ను కూడా సమావేశంలో ప్రదర్శించారు. సిస్కో మాజీ సీఈఓ జాన్ టి. ఛాంబర్స్, అధ్యక్షుడు ముఖేశ్ ఆఘీలు సీఎంపై ప్రశంసలు కురిపించారు. రేవంత్ రెడ్డి విజన్ పారదర్శకంగా, ధైర్యవంతంగా, సాధ్యమయ్యే లక్ష్యాలతో నిండిందని అభిప్రాయపడ్డారు. డిసెంబర్ 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్నకు ఫోరమ్ సభ్యుల్లో అత్యధికులు హాజరయ్యేందుకు అంగీకరించారు. తన వికాస దిశలో తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రపంచంలోని ప్రతి ప్రధాన పెట్టుబడిదారుడు హైదరాబాద్‌ను తప్పనిసరి గమ్యస్థానంగా భావించే రోజు దూరంలో లేదని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# గడ్డిపల్లి–యంగ్ ఇండియా స్కూల్ రోడ్డుకు శంకుస్థాపన


- రూ.20 కోట్లతో 5 కిమీ డబుల్ లైన్ బీటీ రోడ్డు నిర్మాణం
- గడ్డిపల్లి, కుతుబ్‌షాపురం, బొలిశెట్టి వారి గూడెం, చిన్నగారకుంట తండాలకు రవాణా సౌకర్యం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**(సూర్యాపేట, నవంబర్ 13 (తెలంగాణ ముచ్చట్లు):** గడ్డిపల్లి మండలం గడ్డిపల్లిలో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్‌కు రవాణా సౌకర్యం కల్పించేందుకు చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన జరిగింది. రూ.20 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 5 కిలోమీటర్ల డబుల్ లైన్ రహదారి పనులకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శ్రీకారం చుట్టారు. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ ఇప్పటికే రూ.200 కోట్లతో ఆధునిక సదుపాయాలతో నిర్మాణంలో ఉండగా, ఈ రోడ్డు పూర్తికావడం ద్వారా విద్యార్థులు, సిబ్బంది, స్థానిక గ్రామస్తులకు ప్రయాణం మరింత సులభం కానుందని అధికారులు తెలిపారు. గడ్డిపల్లి నుండి స్కూల్ వరకు కొత్త రహదారి నిర్మాణం, గ్రామాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించనుంది. ఈ రహదారితో గడ్డిపల్లి, కుతుబ్‌షాపురం, బొలిశెట్టి వారి గూడెం, చిన్నగారకుంట తండా వంటి గ్రామాలకు సక్రమ రవాణా మౌలిక వసతులు అందుబాటులోకి రానున్నాయి. ఇది స్థానిక వ్యవసాయం-వ్యాపారాలకు కూడా ఊతమివ్వనుంది. పాఠశాలకు చేరుకునే విద్యార్థులకు సురక్షితమైన, వేగవంతమైన ప్రయాణ సౌకర్యం సిద్ధమవుతుందని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, పోలీస్ సూపరింటెండెంట్ నరసింహా, ఆర్డీవో శ్రీనివాసులు, ఆర్అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీతారామయ్య, కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు అరుణ్ కుమార్ దేశ్‌ముఖ్, మండల అధ్యక్షుడు అంజన్ రెడ్డి, మాజీ సర్పంచ్ సుందరి నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# డేటింగ్ యాప్‌లలో మోసాలపై జాగ్రత్త..

(మొదటి పేజీ తరువాయి)




ఫేక్ ప్రొఫైల్‌లు సృష్టించి స్నేహం పేరుతో నమ్మకాన్ని పెంచి డబ్బులు దోచుకునే మోసగాళ్ల పద్ధతులు మరింత చురుకుగా మారుతున్నాయని పోలీసులు తెలిపారు. ముఖ్యంగా యువత ఈ రకమైన ఉచ్చుల్లో పడే అవకాశాలు ఎక్కువైపోవడంతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇటీవలి కాలంలో ఇలాంటి కేసులు పెద్ద సంఖ్యలో నమోదు అయ్యాయి.

డేటింగ్ యాప్‌ల్లో ఎవరైనా అసహజంగా మాట్లాడినా, వ్యక్తిగతంగా కలవమని ఒత్తిడి చేసినా, ఫోటోలు పంపమని డిమాండ్ చేసినా వెంటనే ఆ చాటును నిలిపేయాలని పోలీసులు సలహా ఇచ్చారు. అలాంటి ప్రవర్తన కనిపించిన వెంటనే బ్లాక్ చేసి, చాట్ రికార్డులు, స్క్రీన్‌షాట్లు భద్రపరచాలని సూచించారు.

అజ్ఞాత వ్యక్తుల మాట నమ్మి డబ్బులు పంపడం, వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవడం, ఫోటోలు షేర్ చేయడం అస్సలు చేయొద్దని పోలీసులు పునరుద్ఘాటించారు. ఎలాంటి అనుమానాస్పద సందర్భాల్లోనైనా సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా సైబర్ హెల్ప్‌లైన్ 1930కు వెంటనే సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రంపై మంత్రి తనిఖీ

(మొదటి పేజీ తరువాయి)



ముఖ్యంగా, తగిన బస్తాల లభ్యత, తూకాల ఖచ్చితత్వం, వేచి చూడే రైతులకు నీరు-సేద్య సౌకర్యాలు అందుబాటులో ఉండాలని ఆయన అన్నారు. అధికారులలో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, పోలీస్ సూపరింటెండెంట్ నరసింహా, ఆర్డీవో శ్రీనివాసులు, డీఎస్ఓ మోహన్ బాబు, డీఎమ్ రాము, తహశీల్దార్ కవిత పాల్గొన్నారు. వారు మంత్రి సమక్షంలో ధాన్యం కొనుగోలు పురోగతి, రైతుల వివరాలు, కేంద్రంలో పెండింగ్ అంశాలపై సమగ్ర వివరాలు అందించారు. రైతుల ప్రయోజనం కోసం కొనుగోలు కేంద్రాల్లో పారదర్శక వ్యవస్థ అమలులో ఉందని అధికారులు తెలిపారు. ఎటువంటి ఆలస్యం లేకుండా ధాన్యం చెల్లింపులు రైతుల ఖాతాల్లో జమయ్యేలా చర్యలు మరింత బలోపేతం చేయనున్నట్టు మంత్రి స్పష్టం చేశారు.




# పాలేరు రిజర్వాయర్‌లో చేప పిల్లాల విడుదల

(మొదటి పేజీ తరువాయి)

మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 101 రిజర్వాయర్లలో పెద్ద సైజు రొయ్య పిల్లలను రాబోయే 15 రోజుల్లో ప్రభుత్వం విడుదల చేయనుందని ఆయన తెలిపారు. చేపల ఉత్పత్తి పెరిగి, మత్స్యకారుల ఆదాయం గణనీయంగా పెరుగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అన్నారు. "ప్రతి కులం, ప్రతి వర్గం గౌరవంతో జీవించేందుకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది. పేదల అభివృద్ధి మా మొదటి లక్ష్యం" అని పొంగులేటి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి సుమారు 23 నెలలలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రగతి, సంక్షేమ పథకాలు వేగంగా అమలవుతున్నాయని ఆయన అన్నారు. కాంగ్రెస్ అంటే పేదల పక్షపాతిగా, అండగా నిలిచే పార్టీ అని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఫిషరీస్ & గోట్స్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, జిల్లా అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, మత్స్యకార సంఘాల సభ్యులు పాల్గొన్నారు.




# నష్టాల్లో ఉన్న ఆర్టీసీ డిపోలను లాభాల్లోకి తెచ్చే కార్యాచరణ సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)



ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా రూట్ల విస్తరణ చేయడం ద్వారా ఆర్టీసీ ఆదాయం గణనీయంగా పెరిగే అవకాశం ఉందని అన్నారు. కారుణ్య నియామకాల కింద ఎంపికైన కండక్టర్ల ప్రొవిజన్ పీరియడ్‌ను రెండేళ్లకు తగ్గించాలని తెలిపి ఉద్యోగుల సంక్షేమంపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని వివరించారు. హైదరాబాద్‌లో కొత్త డిపోలకు అవసరమైన స్థలాల పరిశీలన చేసి త్వరితగతిన నివేదిక ఇవ్వాలని అధికారులు చెప్పగా, ఆరాంఘర్ బస్ టెర్మినల్ కోసం పోలీసు శాఖ భూములపై చర్చలు జరపాలని మంత్రి సూచించారు. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్, ప్రయాణికుల పెరుగుతున్న అవసరాలను దృష్టిలో ఉంచుకుని నగర డిపోలను విస్తరించే దిశగా చర్యలు ప్రారంభమవుతున్నాయి. బస్సు ప్రమాదాలను తగ్గించేందుకు ఆధునిక డ్రైవర్ మానిటరింగ్ సిస్టమ్‌ను అమలు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. డ్రైవర్ల మానసిక, శారీరక అలసటను గుర్తించి ముందస్తు హెచ్చరికలు ఇచ్చే ఈ సిస్టమ్ రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గిస్తుందని ఆయన విశ్లేషించారు. త్వరలో ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లతో జూమ్ మీటింగ్ నిర్వహించి సమస్యలు, సూచనలను నేరుగా తెలుసుకోనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

ఆర్టీసీని స్థిరమైన లాభదాయక సంస్థగా మార్చేందుకు ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంటుందని, త్వరలో అమలు చేయనున్న మార్పులు రాష్ట్ర రవాణా రంగానికి కొత్త శకం తెస్తాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.



# గంధసిరిలో సుందర మౌలేశ్వరాలయ పునర్‌నిర్మాణానికి శంకుస్థాపన

(మొదటి పేజీ తరువాయి)

పురాతన శిల్పకళను సంరక్షిస్తూ ఆధునిక వసతులు సమకూర్చే విధంగా పునర్నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఆలయ గర్భగుడి, ప్రధాన మండపాలు, శిలా శాసనాల పునర్‌సంరక్షణకు శిల్ప నిపుణులు ప్రత్యేక రూపకల్పన సిద్ధం చేశారు. కాకతీయుల కళాత్మకత ప్రతిబింబించే ఈ ఆలయం పూర్తయ్యాక రాష్ట్రంలోని ముఖ్య చారిత్రక దేవాలయాల్లో ఒకటిగా నిలవనుందని అధికారులు భావిస్తున్నారు. దేవాలయం పునర్నిర్మాణం స్థానికంగా పర్యాటక, ఆధ్యాత్మిక రంగాల అభివృద్ధికి దోహదపడనుంది. ఆలయ పరిసరాల్లో రహదారులు, పార్కింగ్, లైటింగ్, తాగునీటి సదుపాయాలు వంటి ఆధునిక వసతులు ఏర్పాటు చేయడానికి కూడా ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ చర్యలతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కూడా మరింత ఊతం లభించే అవకాశం ఉన్నట్లు నిపుణులు చెబుతున్నారు. గంధసిరి గ్రామ ప్రజలు ఈ ప్రతిష్ఠాత్మక పునరుద్ధరణను ఎంతో ఆనందంగా స్వాగతిస్తున్నారు. "మన గ్రామ చరిత్ర, మన సంస్కృతి మళ్లీ పునర్జీవం పొందుతోంది" అని స్థానికులు భావిస్తున్నారు. పనులు పూర్తయ్యాక గంధసిరి గ్రామం ఆధ్యాత్మిక పటంలో కొత్త గుర్తింపు పొందుతుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# తెలంగాణ వక్ఫ్ బోర్డు పనితీరు పై మంత్రి అజరుద్దీన్ సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)



మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడం వంటి అంశాలపై ఈ సమావేశంలో విస్తృత చర్చ జరిగింది. ములాఖాతలో మైనారిటీల సంక్షేమ శాఖ సెక్రటరీ బి. షఫీయుల్లా వక్ఫ్ బోర్డు సీఈఓ మహ్మద్ అసదుల్లా, తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వక్ఫ్ ఆస్తుల పై కొనసాగుతున్న వివాదాలు, ఆక్రమణలు, రికార్డ్ డిజిటలైజేషన్, పారదర్శకత పెంపు వంటి అంశాలను మంత్రి ప్రత్యేకంగా సమీక్షించారు. వక్ఫ్ బోర్డు పనితీరును సిస్టమేటిక్‌గా బలోపేతం చేసేందుకు అవసరమైన పరిపాలనా సంస్కరణలపై సూచనలు అందించారు. ఆస్తుల భద్రత, ఆదాయ సాధన, మానిటరింగ్ వ్యవస్థను శక్తివంతం చేయడం వంటి కీలక చర్యలపై సూచనలు చేశారు. బోర్డు పనిచేసే విధానంలో స్పష్టత, వేగం, బాధ్యతాయుతత పెంచడంపై ఆయన దృష్టి పెట్టారు. వక్ఫ్ ఆస్తుల సరైన వినియోగం, కమ్యూనిటీ సంక్షేమం కోసం ఈ సమీక్ష కీలక దశగా నిలవనుందని అధికారులు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వక్ఫ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో కట్టుబడి ఉన్నట్లు మంత్రి అజరుద్దీన్ తెలిపారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక
శుక్రవారం-14- నవంబర్ 2025


# రైతుల సమస్యలపై కేంద్రానికి మంత్రి తుమ్మల లేఖ

(మొదటి పేజీ తరువాయి)



పత్తి పంటల కొనుగోళ్లలో చోటుచేసుకుంటున్న సాంకేతిక సమస్యలు, నాణ్యత ప్రమాణాల కఠినత రైతులకు పెద్ద నష్టాన్ని కలిగిస్తున్నాయని ఆయన స్పష్టం చేశారు. 'మొంథా' తుఫాను, అకాల వర్షాలకు పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, సోయాబీన్ లో ఎఫ్ఏక్యూ ప్రమాణాలలో ప్రత్యేక సడలింపులు ఇవ్వాలని మంత్రి తుమ్మల కేంద్రానికి సూచించారు. వర్షాల ప్రభావంతో గింజల్లో రంగు మారడం, ముడతలు రావడం వంటి సమస్యలు తలెత్తాయని, ఈ పరిస్థితుల్లో సంస్థలు నాణ్యత ప్రమాణాలను మార్చకుండా కొనుగోలు చేపట్టడం రైతులపై అన్యాయం అవుతుందని అన్నారు. అందుకే కొనుగోళ్లకు తక్షణ నాణ్యత సడలింపుల ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో 3.66 లక్షల ఎకరాల్లో సోయాబీన్ సాగు జరగగా, ఎకరాకు సగటు 7.62 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని ఆయన వివరించారు. మొక్కజొన్న కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 48,757 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసి 14,519 మంది రైతులకు లాభం చేకూర్చిందని తెలిపారు. కనీస మద్దతు ధర కింద మొత్తం 16.85 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను కొనుగోలు చేయడానికి కేంద్రం సంస్థలకు అనుమతి ఇవ్వాలని తుమ్మల డిమాండ్ చేశారు. పత్తి కొనుగోళ్లలో ఎకరాకు 7 క్వింటాళ్ల పరిమితి రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తోందని, ఈ పరిమితిని కేంద్రం రద్దు చేయాలని ఆయన కోరారు. తేమ శాతం సడలించి, ఎకరాకు 11.74 క్వింటాళ్ల వాస్తవ దిగుబడి ఆధారంగా కొనుగోళ్లు కొనసాగించాలని సూచించారు. పత్తి, సోయాబీన్, మొక్కజొన్న రైతులు వరుసగా నష్టాలను ఎదుర్కొంటున్నందున వారిని రక్షించేందుకు తక్షణ నిర్ణయాలు తీసుకోవాలని కేంద్రానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

# మంత్రి కొండా సురేఖపై నాగార్జున వేసిన కేసు ఉపసంహరణ

- పరువు నష్టం దావా నిలిపివేత
- బహిరంగ క్షమాపణ అనంతరం తీసుకున్న నిర్ణయం

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):





తెలంగాణ మంత్రి కొండా సురేఖపై వేసిన పరువు నష్టం దావాను ప్రముఖ నటుడు నాగార్జున ఉపసంహరించుకున్నారు. తమ కుటుంబంపై అసభ్యకర వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలతో నాగార్జున గతంలో దాఖలు చేసిన కేసులో మంత్రి సురేఖ క్షమాపణ చెప్పిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. 2024 అక్టోబర్ 2న లంగర్‌హౌస్‌లో జరిగిన మీడియా సమావేశంలో మంత్రి సురేఖ, నాగచైతన్య-సమంత విడాకుల విషయంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసి, కేటీఆర్ కారణమని సంచలన ప్రకటన చేశారు. ఈ వ్యాఖ్యలు రాజకీయంగానే కాక సినీ రంగంలో కూడా పెద్ద దుమారం రేపాయి. అక్కినేని కుటుంబ ప్రతిష్ఠ దెబ్బతినేలా వ్యాఖ్యానించారంటూ నాగార్జున, బీఎన్ఎస్ సెక్షన్ 356 కింద క్రిమినల్ చర్యలు తీసుకోవాలని నాంపల్లి స్పెషల్ కోర్టులో పరువు నష్టం దావా దాఖలు చేశారు. ఈ కేసు విచారణ గురువారం నాంపల్లి కోర్టులో జరిగింది. విచారణకు ముందే మంత్రి కొండా సురేఖ అక్కినేని కుటుంబానికి సోషల్ మీడియా వేదికగా రెండు మార్లు బహిరంగ క్షమాపణలు తెలిపారు. అదే విషయాన్ని కోర్టులోనూ స్పష్టం చేసారు. దీనితో పరిస్థితిని సానుకూల దిశగా తీసుకువెళ్లేందుకు నాగార్జున కేసును ఉపసంహరించుకోవాలని నిర్ణయించారు. సురేఖ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా, వ్యక్తిగతంగా తీవ్రంగా విమర్శలు ఎదుర్కొన్న నేపథ్యంలో, ఈ కేసు ఉపసంహరణ రెండు వర్గాల మధ్య వివాదానికి ముగింపు పలికినట్టేనని విశ్లేషకులు భావిస్తున్నారు.

# బాలానగర్ పి హెచ్ సి లో ఆశా వర్కర్లకు జీతాలు వేయాలి : సిఐటియు

బాలానగర్, నవంబర్ 13 (తెలంగాణ ముచ్చట్లు):



బాలానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఆశా వర్కర్లకు అక్టోబర్ నెల జీతాలు వెంటనే చెల్లించాలని, వారిపై జరుగుతున్న వేధింపులను నిలిపివేయాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) డిమాండ్ చేసింది.వివి నగర్ సబ్ సెంటర్‌లో పనిచేస్తున్న ఏడుగురు ఆశా వర్కర్లకు అక్టోబర్ నెల పారితోషికం "జీరో"గా వేశారని యూనియన్ నేతలు తెలిపారు. పనులు పూర్తిగా చేసినప్పటికీ ఏఎన్‌సీ టార్గెట్ పూర్తి కాలేదన్న కారణంతో జీతం ఆపివేయడం అన్యాయమని వారు పేర్కొన్నారు.ఆశా వర్కర్లు మెడికల్ ఆఫీసర్‌ను ఈ విషయం గురించి అడిగినప్పుడు, "టార్గెట్ పూర్తయితేనే జీతం వేస్తాం, ఒక నెల జీతం రాకపోతేనే మీకు బుద్ధి వస్తుంది" అని సమాధానం ఇచ్చారని వారు వెల్లడించారు.ఈ ఘటనపై మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఆశా యూనియన్ జిల్లా వైద్యాధికారి (డి ఎం హెచ్ ఓ) మరియు డిపిహెచ్ఎన్ఓకు వినతిపత్రం సమర్పించింది.



జిల్లా కార్యదర్శి ఎం. రేవతి కళ్యాణి మాట్లాడుతూ, "ఆశా వర్కర్లు ప్రభుత్వ మాన్యువల్ ప్రకారం అన్ని పనులు పూర్తి చేస్తున్నారు. అయినప్పటికీ, టార్గెట్ పేరుతో జీతం ఆపివేయడం సరికాదు. అధికారులు వెంటనే జోక్యం చేసుకుని న్యాయం చేయాలి," అన్నారు.

జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కె. ఉన్నికృష్ణన్ మాట్లాడుతూ, "ఆశా వర్కర్లతో మాన్యువల్ లో లేని అనేక పనులు చేయించుకుంటూ చివర్లో జీరో బిల్లులు వేయడం తీవ్ర అన్యాయం. ఏఎన్ఎంలు ఆశాలపై దుర్భాషలు మాట్లాడడం, బెదిరించడం ఆపాలి," అని హెచ్చరించారు.

సిఐటియు ఆశా యూనియన్ నాయకులు హెచ్చరిస్తూ, "అధికారులు తక్షణం సమస్య పరిష్కరించకపోతే బాలానగర్ పిహెచ్‌సీ వద్ద ధర్నా నిర్వహించి, అవసరమైతే జిల్లా వ్యాప్తంగా ఉద్యమాన్ని ముదృతం చేస్తాం," అని ప్రకటించారు.



# విద్యా వ్యవస్థ చచ్చిపోయింది విద్యార్థులారా మేల్కొనండి

- ఆర్జీవీ సంచలన ట్వీట్
- ఏఐ విప్లవం ముందు సంప్రదాయ విద్య పని చేయదన్న విమర్శ
- జ్ఞాపకశక్తి ఆధారిత పరీక్షలు అవకాశాలు ఇవ్వవని స్పష్టం

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):

సంచలన వ్యాఖ్యలకు పేరుమోసిన దర్శకుడు రామ్ గోపాల్ వర్మ మళ్లీ మరో ట్వీట్‌తో సోషల్ మీడియాలో చర్చకు తెరలేపారు. కృత్రిమ మేధస్సు (ఏఐ) విప్లవం నేపథ్యంలో ప్రస్తుత విద్యా వ్యవస్థ పూర్తిగా "చనిపోయింది" అని ఆర్జీవీ చేసిన వ్యాఖ్యలు విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల్లో పెద్ద చర్చ రేకెత్తిస్తున్నాయి. "విద్యార్థులారా మేల్కొనండి... ఏఐ ముందు పాత విద్య నిలబడదు" అని ఆయన ట్వీట్‌లో స్పష్టం చేశారు. ప్రస్తుత విద్యా విధానం కాలం చెల్లిందని, అది జ్ఞాపకశక్తిపై ఆధారపడిన పాత పద్ధతి మాత్రమేనని ఆర్జీవీ పేర్కొన్నారు. ఒక క్లిక్‌తో లక్షల కేసులు విశ్లేషించగలిగే ఏఐ ఉన్నప్పుడు, విద్యార్థులు పదేళ్ల పాటు విషయాలు కట్టిపెట్టుకోవడం ఎందుకు? అని ఆయన ప్రశ్నించారు. ఇవి కేవలం చదువుల రూపాన్నే కాదు, మొత్తం వ్యవస్థను పునరాలోచించాలని సూచించే వ్యాఖ్యలుగా కనిపిస్తున్నాయి. ఏఐ సాధనాలను సృజనాత్మకంగా ఉపయోగించడం నేర్పడమే భవిష్యత్ విద్యలో అసలైన లక్ష్యమని ఆర్జీవీ తెలిపారు. విశ్వవిద్యాలయాలు మారే వరకు ఏఐ వేచి ఉండదని, మార్పును అందుకోలేని విధానాలను ఇది చెరిపేస్తుందని హెచ్చరించారు. పాఠశాలలు కూడా తమ బోధన పద్ధతులను మార్చుకుని, పరీక్షల్లో ఏఐని ఒక సహాయక సాధనంగా అనుమతించాలని ఆయన సూచించారు. ఏఐ మిమ్మల్ని చంపదు... కేవలం పట్టించుకోదు అని చేసిన వ్యాఖ్యతో ఆర్జీవీ మరింత దృష్టిని ఆకర్షించారు. ఏఐని వాడలేని వారు భవిష్యత్తులో ఏఐ చేతనే వాడబడతారు అనే ఆయన హెచ్చరిక యువతలో ఆలోచనలకు దారి తీస్తోంది. సాంకేతిక మార్పుల దూకుడు వేగమవుతున్న ఈ సమయంలో విద్యా వ్యవస్థ ఏ దిశలో సాగాలన్న దానిపై ఈ ట్వీట్ విస్తృత చర్చకు కారణమవుతోంది.



# సైబరాబాద్ హోమ్‌గార్డులకు ప్రత్యేక క్రెడిట్ సొసైటీ ప్రారంభం

- తెలంగాణలో తొలి హోమ్‌గార్డుల సహకార క్రెడిట్ సమాఖ్య
- ఆర్థిక సంక్షేమం, సామాజిక భద్రతకు నూతన భరోసా

హైదరాబాద్(తెలంగాణ ముచ్చట్లు):

సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో హోమ్‌గార్డుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన సైబరాబాద్ హోమ్ గార్డ్స్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ అధికారికంగా ప్రారంభమైంది. తెలంగాణలో హోమ్‌గార్డుల కోసం ప్రత్యేకంగా స్థాపించబడిన ఇదే తొలి క్రెడిట్ సమాఖ్య కావడం విశేషం. సైబరాబాద్ పోలీసులు దీన్ని గర్వంగా ప్రారంభించినట్లు ప్రకటించారు. హోమ్‌గార్డుల ఆర్థిక సంక్షేమం, సామాజిక భద్రతపై దృష్టి సారించి ఈ క్రెడిట్ సొసైటీ రూపుదిద్దుకుంది. రుణ సౌకర్యాలు, అత్యవసర ఆర్థిక సహాయ పథకాలు, ఆదాయ భద్రతా పథకాలు వంటి సహకార సేవలను అందించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. ఈ సమాఖ్య ద్వారా సభ్యుల ఆర్థిక అవసరాలు సులభంగా నెరవేర్చే అవకాశముందని అధికారులు వెల్లడించారు. పోలీసు శాఖలో కీలక పాత్ర పోషించే హోమ్‌గార్డుల కోసం ఈ విధమైన సహకార వ్యవస్థ అవసరమని చాలా కాలంగా వినిపిస్తోన్న అభిప్రాయాలు ఇప్పుడు ఫలితంగా మారాయి. రోజువారీ విధుల్లో రిస్క్ తీసుకుంటున్న హోమ్‌గార్డులకు ఇది ఆర్థిక భరోసాను ఇవ్వనున్నదని అధికారులు చెప్పారు. ఈ క్రెడిట్ సొసైటీ ప్రారంభంతో హోమ్‌గార్డుల సామాజిక, కుటుంబ సంక్షేమం మరింత బలోపేతం కానుందని, భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టే అవకాశముందని పోలీసులు ఆశాభావం వ్యక్తం చేశారు.






# బొగ్గు నాణ్యత వారోత్సవాలు ప్రారంభం..!

- క్వాలిటీ జెండా ఎగరవేసిన బుడగం రామకృష్ణ.

సత్తుపల్లి, నవంబర్ 13 (తెలంగాణ ముచ్చట్లు):

సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సత్తుపల్లి ఏరియా పరిధిలోని కిష్టారం ఓపెన్‌కాస్ట్‌లో గురువారం బొగ్గు నాణ్యత వారోత్సవాలు-2025 ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 13 నుండి 19 వరకు ఈ ఉత్సవాలు కొనసాగనున్నాయి.

ఈ సందర్భంగా సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ యన్. బలరాం (ఐఆర్ఎస్) పంపిన సందేశాన్ని ఉద్యోగులకు పాంప్లెట్ రూపంలో అందజేశారు. సత్తుపల్లి ఏరియా జీఎం చింతల శ్రీనివాసరావు, ప్రాజెక్టు ఆఫీసర్ ఏ.ఎల్.ఎస్.వి. సునీల్ వర్మ ఆదేశాల మేరకు కిష్టారం ఓసీ కాలరీ మేనేజర్ బుడగం రామకృష్ణ క్వాలిటీ జెండాను ఎగురవేశారు.

తదనంతరం మాట్లాడుతూ, "మార్కెట్‌లో మన బొగ్గు నాణ్యతతోనే నెగ్గు" అనే నినాదంతో సింగరేణి సంస్థ ఎల్లప్పుడూ నాణ్యమైన బొగ్గును వినియోగదారులకు అందిస్తోందని తెలిపారు. ఉద్యోగులు తమ భాగస్వామ్యాన్ని మరింతగా పెంచి, నాణ్యత పరిరక్షణలో ముందుండాలని సూచించారు. క్వాలిటీ ఇంచార్జి ఏ. అవినాష్ ఆధ్వర్యంలో ఉద్యోగులు క్వాలిటీ ప్రతిజ్ఞ చేశారు.

ఈ కార్యక్రమంలో మేనేజర్ బి. రామకృష్ణ, ప్రాజెక్టు ఇంజనీర్ జి. వెంకటేశ్వరరావు, అడిషనల్ మేనేజర్ వల్లమల్ల బాబు, సేఫ్టీ ఆఫీసర్ గోపికిషోర్, బ్లాస్టింగ్ ఇన్చార్జి సూర్యప్రకాశ్, అడిషనల్ మేనేజర్ ఫజల్ రెహమాన్, వెల్ఫేర్ ఆఫీసర్ కే. శ్రీనివాస్, ఏఐటీయూసీ ఫిట్ సెక్రటరీ ఏ. కిషోర్ కుమార్, ఐఎన్టీయూసీ అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ యం.డి. అఫ్రోజ్ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ఆదిభట్ల మున్సిపాలిటీలో అవినీతి బహిర్గతం

- టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ వరప్రసాద్, అసిస్టెంట్ వంశీ లంచం తీసుకుంటూ అరెస్ట్
- ఇల్లు నిర్మాణ అనుమతుల కోసం ₹75 వేలు వసూలు చేసినట్లు ఏసీబీ నిర్ధారణ

హైదరాబాద్(తెలంగాణ ముచ్చట్లు):

రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల మున్సిపాలిటీలో అవినీతి మరోసారి బయటపడింది. మున్సిపల్ టౌన్ ప్లానింగ్ శాఖలో కొనసాగుతున్న అవినీతి కార్యకలాపాలపై వచ్చిన సమాచారంతో ఏసీబీ అధికారులు ఈరోజు దాడులు నిర్వహించారు. తక్షణమే టీఎంపి ఆఫీసర్ వరప్రసాద్ మరియు అసిస్టెంట్ వంశీ లంచం స్వీకరిస్తున్న సమయంలోనే రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఇల్లు నిర్మాణానికి సంబంధించిన పర్మిషన్ మంజూరు కోసం ₹75 వేలు లంచం తీసుకుంటున్నట్లు ఏసీబీ అధికారులు ధృవీకరించారు. కొంతకాలంగా ఈ ఇద్దరు అధికారుల అవినీతి కార్యకలాపాలపై ఫిర్యాదులు రావడంతో ఏసీబీ దర్యాప్తు ప్రారంభించినట్లు సమాచారం. చివరకు ప్లాన్ చేసిన ట్రాప్‌లో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. దాడుల వెంటనే అధికారులు ఆఫీస్ గది, వ్యక్తిగత ఫైళ్ళు, పర్మిషన్ దరఖాస్తులతో సహా పలు పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. లంచం డబ్బుల మూలం, ఇతర సంబంధిత అధికారుల ప్రమాణాలు, గత అనుమతుల వివరాలు వంటి అంశాలపై ఏసీబీ సవివర దర్యాప్తు కొనసాగిస్తోంది. ఈ ఘటనతో ఆదిభట్ల మున్సిపల్ కార్యాలయంలో అవినీతి వ్యవహారాలపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇలాంటివి పునరావృతం కాకుండా మున్సిపాలిటీలో కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# ఎమ్మెల్యే బండారి వ్యాఖ్యలను ఖండించిన కాంగ్రెస్ నాయకుడు ఎస్.వి.కిట్టు

మల్లాపూర్ , నవంబర్ 13 (తెలంగాణ ముచ్చట్లు):



ఉప్పల్ నియోజకవర్గం మల్లాపూర్ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు భూకబ్జాలకు పాల్పడుతున్నారని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేసిన వ్యాఖ్యలను మల్లాపూర్ కాంగ్రెస్ నాయకుడు ఎస్.వి. కిట్టు తీవ్రంగా ఖండించారు.తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మల్లాపూర్ సర్వే నెంబర్ 109లో కాంగ్రెస్ పార్టీకి చెందిన సూర్ణం శివ అనే వ్యక్తి 90 గజాల భూమిని కబ్జా చేశారని, ఆ భూమిని కాపాడేందుకు ప్రహరి గోడ నిర్మిస్తున్నామని ఎమ్మెల్యే చెప్పడం విడ్డూరమని పేర్కొన్నారు. సూర్ణం శివ కాంగ్రెస్ నాయకుడు కాదు, టిఆర్ఎస్ (ప్రస్తుత బిఆర్ఎస్) నాయకుడు అని, దీనికి సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని ఎస్.వి. కిట్టు తెలిపారు. బిఆర్ఎస్ నాయకులే కబ్జాలు చేస్తూ, కాంగ్రెస్ నేతలపై ఆరోపణలు చేయడం ఎమ్మెల్యేకు తగదని విమర్శించారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక ప్రభుత్వ భూములను కాపాడిందని గుర్తు చేస్తూ, భూకబ్జా కాకుండా ప్రహరి గోడ నిర్మాణానికి తాము స్వాగతం పలుకుతున్నామ ని, అయితే కాంగ్రెస్ నేతలపై తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలని ఆయన సూచించారు.

# బాధిత కుటుంబానికి సురేష్ కుమార్ ఆర్థిక సాయం

పెద్దమందడి,నవంబర్13( తెలంగాణ ముచ్చట్లు):



పెద్దమందడి మండలం దొడగుంటపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకుడు గజ్జ రాములు గారి అన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది.విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ జిల్లా నాయకులు పానుగంటి సురేష్ కుమార్ గురువారం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి, దశదిన కర్మ నిర్వహణ ఖర్చుల నిమిత్తం సురేష్ కుమార్ వ్యక్తిగతంగా 2,000 రూపాయలను ఆర్థిక సాయం అందజేశారు. బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పిన సురేష్ కుమార్ బిఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తుంది. ఇలాంటి కష్టసమయాల్లో సహాయం చేయడం ప్రతి కార్యకర్త బాధ్యత అని అన్నారు.

ఈ కార్యక్రమంలో స్థానిక బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.



# నూతన గృహ ప్రవేశానికి హాజరైన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

**వనపర్తి,నవంబర్13(తెలంగాణ ముచ్చట్లు):**

వనపర్తి పట్టణం, టీచర్స్ కాలనీలోని బిఆర్ఎస్ వృద్ధ నాయకుడు వెంకటసాగర్ నూతన గృహ ప్రవేశ వేడుకలో మాజీ మంత్రి వర్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ముఖ్య అతిధిగా హాజరై కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంలో ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి ఆనంద సందర్భాల్లో కుటుంబ సభ్యులతో కలసి ఉత్సాహభరితంగా పాల్గొని శుభాకాంక్షలు చెప్పడం ఆనందంగా ఉంటుంది. గ్రామస్తులు, పరిచయులు ఇలాగే ఒకరికి ఒకరు తోడుగా ఉండాలి అని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గట్టూ యాదవ్, వాకిటి శ్రీధర్, మండల పార్టీ అధ్యక్షులు కేమాణిక్యం, విష్ణు సాగర్, మురళి సాగర్, జోహేబ్ హుస్సేన్, చిట్యాల రాము, ఆరిఫ్, ధర్మశాస్త్రి రామకృష్ణ, రాజేశ్వర్ రెడ్డి, బాలయ్య, విష్ణు, సత్యనారాయణ చారి, అంజి రమేష్ నాయక్, కేశవులు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# నేతృత్వ పోటీలు విద్యార్థుల నైపుణ్యాన్ని వెలికితీస్తాయి

**నాచారం, నవంబర్ 13 (తెలంగాణ ముచ్చట్లు):**

తార్నాక నారాయణ పాఠశాలలో ఈకిడ్జ్ విద్యార్థుల నేతృత్వ సమావేశం ఘనంగా జరిగింది. తరగతుల్లో నేర్చుకున్న విషయాలు, ప్రాజెక్టులు, విజ్ఞాన ప్రదర్శనలు ఆ చిన్నారులు సొంతంగా సిద్ధం చేసి ఆకట్టుకున్నారు. విద్యార్థులు తమ పాఠ్యాంశాలను తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు అనర్గళంగా వివరించారు .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జి.ఎం. గోపాల్ రెడ్డి, ఏ.జి.యం. బాల పరమేశ్వరరావు హాజరై మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచే కొత్త ఆవిష్కరణలకు ముందుకు రావడం గర్వకారణమని, విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు నేతృత్వ పోటీలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ పర్వీన్ మాట్లాడుతూ, చదువుతో పాటు ప్రతి రంగంలోనూ ముందుండే లక్ష్యంతో విద్యార్థులు కృషి చేయాలని సూచించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించి, భయాన్ని అధిగమించే ధైర్యాన్ని ఇస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈకిడ్జ్ ఆర్‌డీ హెడ్ మీనా, కోఆర్డినేటర్ నూర్, విపి షాహీన్, ఏఓ మహేందర్, పిఈటీ నరేష్, సాఫ్ట్ స్కిల్స్ డిపార్ట్‌మెంట్ పూజ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



# మల్కాజ్‌గిరిలో అజంతా,తిరుపతి ఎక్స్‌ప్రెస్‌ల నిలుపుదల కృషి చేసిన నూర్‌కు సన్మానం

**మల్కాజ్‌గిరి, నవంబర్ 13 (తెలంగాణ ముచ్చట్లు):**

మల్కాజ్‌గిరి రైల్వే స్టేషన్‌లో అజంతా ఎక్స్‌ప్రెస్, షిర్డీ సాయినగర్ ,తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు నిలుపుదల కల్పించే దిశగా కృషి చేసిన దక్షిణ మధ్య రైల్వే జోన్ జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యుడు, ట్రైన్ ట్రావెలర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నూర్‌ను శ్రీ సాయిబాబా టెంపుల్ ట్రస్ట్ సభ్యులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ, “మల్కాజ్‌గిరి ప్రాంత ప్రజల ఎన్నో ఏళ్ల ఆశయాన్ని నూర్ సాధించారు. ఆయన నిరంతర కృషి ఫలితంగా ఈ రెండు ప్రధాన రైళ్లు ఇక్కడ నిలవడం స్థానిక ప్రయాణికులకు ఎంతో సౌకర్యం కలిగించింది” అని పేర్కొన్నారు.నూర్ మాట్లాడు తూ, “ప్రాంత ప్రజల సౌకర్యం కోసం ఇంకా మరిన్ని రైళ్ల నిలుపుదల, సౌకర్యాల మెరుగుదల కోసం రైల్వే అధికారులతో చర్చలు కొనసాగిస్తాను” అన్నారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు లింగా రెడ్డి, జి. హనుమంత్ రావు, శ్రీనివాస్ శర్మ, చెన్నకేశవ రావు, నర్సింగ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు. సన్మాన కార్యక్రమం సాయిబాబా ఆలయ ప్రాంగణంలో ఉత్సాహంగా జరిగింది.

# రామలింగేశ్వర కాలనీలో మహిళ అనుమానాస్పద మృతి

**కీసర, నవంబర్ 13 (తెలంగాణ ముచ్చట్లు):**

గురువారం సాయంత్రం రామలింగేశ్వర కాలనీలో చోటుచేసుకున్న ఘటన స్థానికులను కలవరపరిచింది. స్వప్న (వయస్సు సుమారు 40 సంవత్సరాలు), వృత్తి కూలీ, వడ్డెర కులానికి చెందిన మహిళ, అనుమానాస్పద రీతిలో మృతి చెందింది.స్వప్నకు మొదటి భర్త సుమారు 15 సంవత్సరాల క్రితం మరణించగా, ఆ వివాహం ద్వారా ముగ్గురు పిల్లలు ఉన్నారు. అనంతరం సుమారు ఆరు సంవత్సరాల క్రితం ఆమె శ్రీనును రెండవ వివాహం చేసుకుంది.

గురువారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో, ఆమె నివాసంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఘటన సమయంలో ఆమె భర్త శ్రీను కూడా ఇంట్లోనే ఉన్నట్లు సమాచారం. స్వప్న, శ్రీను ఇద్దరూ మద్యం సేవించినట్లు ప్రాథమిక సమాచారం. స్థానికుల సమాచారం మేరకు కీసర పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పంపించగా, కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

# సిపిఐ 100 సంవత్సరాల ఉత్సవాలను జయప్రదం చేయండి

**ఎల్కతుర్తి, నవంబర్ 12 (తెలంగాణ ముచ్చట్లు)**



సిపిఐ పార్టీ 100వ వార్షికోత్సవాలను జయప్రదంగా నిర్వహించాలంటూ సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి పిలుపునిచ్చారు. ఈనెల 18, 19 తేదీల్లో హనుమకొండ జిల్లాలో ముల్కనూర్, ఎల్కతుర్తి, హసన్పర్తి, హనుమకొండ, దామెర, శాయంపేట, పరకాల మీదుగా సిపిఐ రాష్ట్ర బస్సు జాతా నిర్వహించబడనుంది. ఈ జాతాకు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఎల్కతుర్తి మండల కేంద్రంలో శనికరపు రాజకుమార్ అధ్యక్షతన జరిగిన ఎల్కతుర్తి, భీమదేవరపల్లి, కమలాపూర్, హసన్పర్తి మండలాల సిపిఐ ముఖ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కర్రె బిక్షపతి మాట్లాడుతూ.. “1925 డిసెంబర్ 26న ఆవిర్భవించిన సిపిఐ పార్టీ దేశ స్వాతంత్ర్య సమరానికి దిక్సూచి వంటిదని, కాన్పూర్, మీరట్, పెషావర్, లాహోర్ వంటి కుట్ర కేసుల ద్వారా నాయకులను జైలుకు పంపించినా స్వాతంత్ర్యం కోసం అచంచలంగా పోరాడింది” అని గుర్తుచేశారు.

అలాగే భూస్వామ్య వ్యవస్థకు, కార్పొరేట్ పెట్టుబడిదారీ ధోరణులకు వ్యతిరేకంగా నిరంతర పోరాటం చేస్తూ కార్మికులు, రైతులు, పేదలకు అండగా నిలిచిన పార్టీ సిపిఐ అని అన్నారు.

తెలంగాణలో దొరల గడిలను కూలదోయి 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన చరిత్ర సిపిఐకే చెందిందని, రైతాంగ సాయుధ పోరాటం ప్రపంచ చరిత్రలోనే విశిష్టమైనదని ఆయన పేర్కొన్నారు.

“18 సంవత్సరాలు నిండిన యువతకు ఓటు హక్కు సాధించిందీ సిపిఐ పార్టీ. బ్యాంకుల జాతీయాకరణ, ప్రభుత్వ రంగ సంస్థల రక్షణ కోసం ఎన్నో ఉద్యమాలు చేసింది. అయితే నేటి కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ దారిలో నడుస్తూ రాజ్యాంగ విలువలను దెబ్బతీస్తోంది” అని ఆయన విమర్శించారు.

సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు శ్రీనివాస్ మాట్లాడుతూ— “ఈనెల 18, 19 తేదీల్లో జరిగే రాష్ట్ర బస్సుజాతాకు సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడా వెంకటరెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేని శంకర్, నాయకులు మార్పాక అనిల్‌కుమార్, మణికంఠ రెడ్డి తదితరులు నాయకత్వం వహించనున్నారని” తెలిపారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, అలాగే శంకరప్ప రాజ్‌కుమార్, నేదునూరి రాజమౌళి, జక్కు రాజు గౌడ్, మంచాల రమాదేవి, నకిర్తి ఓదెలు, నెట్టెం నారాయణ, మెట్టు శ్యామ్‌సుందర్ రెడ్డి, మోతే లింగారెడ్డి, ఆదరి రమేష్, నిమ్మల మనోహర్, మర్రి విజయ్, గడ్డం రాజనర్సు, చంద్రమౌళి, ముండయ్య, గడ్డం లలిత, బొంత మల్లన్న, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.






# బీసీ జేఏసీ ఆధ్వర్యంలో నర్సంపేటలో మహా ధర్మ పోరాట దీక్ష

**నర్సంపేట,తెలంగాణ ముచ్చట్లు (తెలంగాణ ముచ్చట్లు):**

నర్సంపేట పట్టణంలో అమరుల స్థూపం ఎదురుగా బీసీ జేఏసీ ఆధ్వర్యంలో మహా ధర్మ పోరాట దీక్ష నిర్వహించారు. బీసీ జేఏసీ చైర్మన్ డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమాన్ని బీసీ సీనియర్ నాయకుడు కుసుమ భద్రయ్య, విద్యావంతుల వేదిక రాష్ట్ర కన్వీనర్ జగదీశ్వర్ ప్రారంభించారు. కార్యక్రమంలో కుల సంఘాల ప్రతినిధులతో పాటు పలువురు రాజకీయ నాయకులు కూడా పాల్గొన్నారు.

వక్తలు మాట్లాడుతూ బీసీలకు నలభై రెండు శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును పార్లమెంటులో ఆమోదించించి, రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. బీసీలకు న్యాయం చేయడం కేంద్ర ప్రభుత్వ ధోరణిపైనే ఆధారపడి ఉందని పేర్కొన్నారు. బీసీ జేఏసీ పిలుపుతో ప్రారంభమైన అష్టాంగ ఆందోళనకు బీసీ సమాజం, ఇతర సామాజిక వర్గాలు సహకరించాలని కోరారు. డిమాండ్లు నెరవేరకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

దీక్షలో బీసీ కుల సంఘాలు, విద్యార్థి సంఘాలు, కార్మిక సంఘాల ప్రతినిధులు, రాజకీయ పార్టీలు పాల్గొన్నారు. కార్యక్రమ ముగింపు సందర్భంగా విద్యావంతుల వేదిక రాష్ట్ర కన్వీనర్ జగదీశ్వర్, ఎమ్మార్పీఎస్ నాయకుడు కల్లపెల్లి ప్రణయ్ దీప్ మాదిగ, వైద్యుడు కావటి విజయ్ నిమ్మరసం అందించి దీక్షను విరమింప చేశారు.



ఈ కార్యక్రమంలో రజక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ, బీసీ పవర్ రాష్ట్ర అధ్యక్షుడు ఆబోతు రాజు యాదవ్, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకుడు నందగిరి రజనీకాంత్, గౌడ సంఘం నాయకుడు మచ్చిక రాజు గౌడ్, కాంగ్రెస్ యూత్ నాయకుడు డ్యాగం శివాజీ, మాజీ జెడ్పిటిసి బత్తిని శ్రీనివాస్ గౌడ్, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ, నర్సంపేట పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణ గౌడ్, సిపిఎం జిల్లా నాయకుడు కోరబోయిన కుమారస్వామి, ఎం సిపిఐ యు నాయకుడు కొత్తకొండ రాజమౌళి, ఎం సిపిఐ యు రాష్ట్ర మహిళా నాయకురాలు వంగాల రాగ సుధా, బీసీ జేఏసీ నాయకులు కుమారస్వామి, బీసీ జేఏసీ వైస్ చైర్మన్ సురేష్ యాదవ్, రజక సంఘం అధ్యక్షుడు కొల్లూరి లక్ష్మీనారాయణ, చెన్నూరి రవి ముదిరాజ్, కానుగుల కుమారస్వామి యాదవ్, పరికి మధూకర్, రాజులపాటి సూరయ్య, దాడి రాజు, బర్ల యాకయ్య, పొన్నాల మహిపాల్, బండి విజయ, ముంజ లక్ష్మి, కారుపోతుల శ్రీదేవి, మద్దెల శ్యాంకుమార్ యాదవ్, మారపాక రమేష్, మద్దెల కొమురయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# విద్యాసంస్థలపై దాడులు అమానుషం

- ఎల్కతుర్తి ట్రస్మా మండల నాయకులు సుధీర్ రావు, పుస్కూరి కార్తీక్ రావు

**ఎల్కతుర్తి, నవంబర్ 13 (తెలంగాణ ముచ్చట్లు):**

ప్రైవేట్ విద్యాసంస్థలపై విద్యార్థి సంఘాలు చేసిన భౌతిక దాడులను ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్య ప్రతినిధులు తీవ్రంగా ఖండించారు.

హనుమకొండ కలెక్టరేట్ ఎదుట శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించి, దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్, పోలీస్ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

ఈ సందర్భంగా ఎల్కతుర్తి ట్రస్మా మండల నాయకులు సుధీర్ రావు, కార్తీక్ రావు మాట్లాడుతూ “విద్యా రంగం పవిత్రమైనది. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే ఉపాధ్యాయులపై దాడులు చేయడం మానవత్వానికి విరుద్ధం” అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిరసనలో ఎల్కతుర్తి మండలంలోని సెయింట్ థామస్ అల్టిట్యూడ్ హై స్కూల్, విజ్ఞాన్ స్కూల్, శ్రీ చైతన్య హై స్కూల్, కార్మెల్ కాన్వెంట్ హై స్కూల్ తదితర ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. వేలాదిమంది ఉపాధ్యాయులు ర్యాలీ రూపంలో చేరి విద్యా రంగంపై దాడులను నిలువరించాలని ప్రభుత్వాన్ని కోరారు.



# ప్లైవుడ్ షాపులో అగ్నిప్రమాదం?

- ప్లైవుడ్ షాపులో అగ్నిప్రమాదం జరిపించారా ప్రజలు అనుమానం?

**కాప్రా, నవంబర్ 13 (తెలంగాణ ముచ్చట్లు):**

మీర్పేట్ హెచ్ పీ కాలనీ లో కృష్ణానగర్ రోడ్‌నంబర్-8లోని ఒక ప్లైవుడ్ & హార్డ్వేర్ షాపులో బుధవారం రాత్రి భారీ అగ్నిప్రమాదం సంభవించింది. రాత్రి 9గంటల సమయంలో మంటలు చెలరేగి షాప్ మొత్తం క్షణాల్లో ఆవిరైంది. దుకాణం నుండి మంటలు, పొగలు ఎగసిపడడంతో పరిసర ప్రాంత ప్రజలు బయటకు పరుగులు తీశారు. స్థానికులు వెంటనే అగ్నిమాపక శాఖకు, పోలీసులకు సమాచారం అందించారు.సూచన అందుకున్న వెంటనే కుషాయిగూడ పోలీసు బృందం,ఫైరింజన్లు అక్కడికి చేరుకొని సుమారు గంటసేపు తీవ్రంగా కృషి చేసి మంటలను అదుపులోకి తెచ్చారు.ప్రాథమిక సమాచారం ప్రకారం షాప్‌లో ఉన్న ఫర్నిచర్, ప్లైవుడ్ షీట్లు, వుడ్ మెటీరియల్ దగ్ధమై సుమారు రూ.10 లక్షల ఆస్తినష్టం జరిగినట్లు పోలీసులు తెలిపారు. షాప్ యజమాని లక్ష్మణ్ కుమార్‌గా గుర్తించారు. అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.అగ్నిప్రమాదానికి గల కారణాలు తక్షణం తెలియరాలేదు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి ఉండొచ్చని అధికారులు



అనుమానిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రస్తుతం పరిస్థితి సాధారణంగా ఉందని తెలిపారు.స్థానికులు మాట్లాడుతూ, “మంటలు ఒక్కసారిగా పెరిగిపోయి భయాందోళనకు గురయ్యాం. అగ్నిమాపక సిబ్బంది సమయానికి రాకపోతే సమీపంలోని షాపులు కూడా దగ్ధమయ్యేవి” అని పేర్కొన్నారు.





# “అమ్మానాన్నల ఆశలు నిలబెట్టాలి... గురువుల మాటలు గౌరవించాలి”

- **తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**
- **చదువుతో పాటు విలువలు, సంస్కారం తప్పనిసరి**

**ఖమ్మం బ్యూరో, నవంబర్ 13, తెలంగాణ ముచ్చట్లు;**

తల్లిదండ్రులు, గురువుల పట్ల ఎల్లప్పుడూ మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విద్యార్థులను పిలుపునిచ్చారు. కూసుమంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్‌స్పైర్ అండ్ ఇగ్నైట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాభివృద్ధి శిక్షణా తరగతులు కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ... “వజ్రం కూడా సానపెడితేనే విలువ తెలుస్తుంది. అదే విధంగా విద్యార్థుల్లో దాగి ఉన్న భావోద్వేగాలు, మానవీయ విలువలను రంజిత్ బృందం అద్భుతంగా వెలికితీశారు. అమ్మానాన్నల ప్రేమ, గురువుల గౌరవం అనేవి జీవిత పునాది. ఈ విలువలు నేర్చుకున్నవారే నిజమైన విద్యావంతులు” అని పేర్కొన్నారు.

రంజిత్ బృందం చేస్తున్న విలువలబోధక కార్యక్రమాలు పాలేరు నియోజకవర్గంలోని ప్రతి మండలంలో నిర్వహించాలనుకుంటున్నాని, అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా అమలుకు ముఖ్యమంత్రితో చర్చిస్తానని మంత్రి తెలిపారు. “మనల్ని నిస్వార్థంగా ప్రేమించేది అమ్మానాన్నలు, గురువులే. నేడు కొంతమంది యువత డ్రగ్స్, చెడు అలవాట్లకు బానిసలవుతున్నారు. ప్రభుత్వం డ్రగ్స్ భూతాన్ని నిర్మూలించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లోనూ చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి” అని మంత్రి సూచించారు. అమ్మానాన్నలు మనపై పెట్టుకున్న ఆశలను గుర్తుంచుకొని లక్ష్యసాధన దిశగా కృషి చేయాలని, తల్లిదండ్రుల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని విద్యార్థులకు మంత్రి పిలుపునిచ్చారు.

తదనంతరం పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా జూనియర్ కళాశాలలో చదువుతున్న 34 మంది బాలికలకు సైకిళ్లను మంత్రి పొంగులేటి పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, ఎంఈఓ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ప్రభుత్వం... పేదల నేస్తం!

- **మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**
- **పాలేరు రిజర్వాయర్‌లో చేప పిల్లల విడుదల**
- **రాబోయే రోజుల్లో రొయ్య పిల్లల పంపిణీకి మంత్రి భరోసా**

**ఖమ్మం బ్యూరో, నవంబర్ 13, తెలంగాణ ముచ్చట్లు;**



పేదల పక్షపాతిగా ఇందిరమ్మ ప్రభుత్వం పని చేస్తోందని తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. గురువారం కూసుమంచి మండలంలోని పాలేరు గ్రామ రిజర్వాయర్‌లో చేప పిల్లలను మంత్రి విడుదల చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రజల ఆశీర్వాదంతో తెలంగాణలో ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడి 22 నెలలుగా పేదల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పాలన సాగిస్తోందని చెప్పారు. పేదల జీవనోపాధి కష్టాలపై దృష్టిపెట్టి ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు.

మత్స్యకార సోదరుల అభ్యర్థన మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 101 మీడియం, మేజర్ రిజర్వాయర్లలో పెద్దసైజు రొయ్య పిల్లలను రాబోయే 15 రోజుల్లో విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అతి పెద్ద ప్రాజెక్టుగా ఉన్న పాలేరు రిజర్వాయర్‌లో ఇప్పటికే రెండు సార్లు చేప పిల్లల విడుదల చేసినట్లు గుర్తుచేశారు.

ఆర్భాటాలకు కాకుండా, ప్రతి రూపాయి ప్రజల సంక్షేమానికే వినియోగించే విధంగా ఇందిరమ్మ ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి స్పష్టం చేశారు.

తరువాత కూసుమంచి క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 90 మంది లబ్ధిదారులకు రూ.37 లక్షల 97 వేల 500 విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంత్రి అందజేశారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర మత్స్య సహకార సంఘాల సమాఖ్య చైర్మన్ మెట్టు సాయి కుమార్, ఖమ్మం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, తహసిల్దార్ రవికుమార్, ఎంపిడీఓ, ప్రజా ప్రతినిధులు, మత్స్యకార సంఘాల నాయకులు పాల్గొన్నారు.





# మామునూర్ ఎయిర్ పోర్టు స్థల విస్తరణ పనులు పరిశీలించిన ఎంపీ కడియం కావ్య

- **ఎయిర్ పోర్ట్ పనుల్లో జాప్యం జరగకూడదు**
- **చిన్న చిన్న సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలి**

**వరంగల్,నవంబర్13(తెలంగాణ ముచ్చట్లు):**

ఓరుగల్లులో విమానాశ్రయ కల త్వరలో నిజం కాబోతుందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య తెలిపారు. జిల్లా కలెక్టర్ సత్య శారద, ఇరిగేషన్, ఆర్అండ్‌బి అధికారులతో కలిసి మామునూరు విమానాశ్రయ స్థల విస్తరణ పనులను పరిశీలించారు. నక్కలపల్లి, గాడిపల్లి చెరువులు అలాగే ఎయిర్‌పోర్టుకు వెళ్లే రహదారుల పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు.ఎయిర్‌పోర్టు పనుల్లో ఎటువంటి జాప్యం చోటుచేసుకోకూడదని, చిన్న చిన్న అంశాలు తలెత్తినా వెంటనే పరిష్కరించేలా చూడాలని కావ్య అధికారులకు సూచించారు. అనంతరం అధికారులిచ్చిన మ్యాప్ వివరాలను పరిశీలించి పనుల పురోగతిపై సమాచారం అందుకున్నారు.

ఈ సందర్భంగా కావ్య మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో విమానాశ్రయ పనులు వేగవంతంగా సాగుతున్నాయని తెలిపారు. మామునూరులో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని అంతర్జాతీయ స్థాయి ఎయిర్‌పోర్టుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించామని అన్నారు. ప్రయాణికుల రవాణాతో పాటు కార్గో సేవలను కూడా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు.

వరంగల్‌ను రాష్ట్ర రెండో రాజధానిగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కాకతీయ మెగా టెక్స్టైల్ పార్కు సమీపంలో ఉండటం వల్ల ఎయిర్‌పోర్టు సేవలు ప్రారంభమైతే వరంగల్ అభివృద్ధి మరింత వేగం అందుకుంటుందని చెప్పారు.

# బిసి కార్పొరేషన్ రుణాలు వెంటనే విడుదల చేయాలి

- **చైర్మన్ నూతి శ్రీకాంత్‌ను కలిసిన బహుజన సంక్షేమ సంఘ ప్రతినిధులు**

**హైదరాబాద్,నవంబర్13(తెలంగాణ ముచ్చట్లు):**



తెలంగాణ బిసి కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌ను మసాబ్ ట్యాంక్‌లోని కార్పొరేషన్ కార్యాలయంలో తెలంగాణ బిసి బహుజన సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ప్రతాపగిరి విజయకుమార్, సోషల్ వర్కర్ నందికంటి సాయికుమార్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి సమావేశమయ్యారు. గత సంవత్సరం మార్చి నెలలో ఎంపిక పూర్తైనప్పటికీ ఇంకా నిలిపివేసిన బిసి కార్పొరేషన్ రుణాలను వెంటనే విడుదల చేయాలని వారు చైర్మన్‌కు విజ్ఞప్తి చేశారు.

సమావేశంలో ప్రతినిధులు మాట్లాడుతూ, రుణాలు ఆలస్యమవడం వల్ల వేలాదిమంది లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అనేక కుటుంబాలు ఆర్థిక సమస్యల్లో చిక్కుకుని ఉపాధి అవకాశాల కోసం ఎదురు చూస్తున్నాయని వివరించారు. ఎంపిక పూర్తైన తర్వాత రుణాలు నిలిపివేయడం వల్ల పలువురు యువకులు చిన్న వ్యాపారాలు ప్రారంభించలేక నిరుత్సాహానికి గురవుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రకటించిన సంక్షేమ పథకాల అసలు ప్రయోజనం ప్రజలకు చేరాలంటే రుణాల విడుదల అత్యవసరమని అభిప్రాయపడ్డారు.

ఈ సందర్భంగా వారు బిసి వర్గాల అభ్యున్నతికి కార్పొరేషన్ పాలసీలు మరింత వేగంగా అమలవ్వాలని కోరారు. రాష్ట్రంలో వెనుకబడిన వర్గాల ఆర్థిక స్వావలంబన కోసం రుణాల విడుదల చాలా కీలకమని, దీన్ని ప్రాధాన్యతగా పరిగణించి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుకున్నారు.చైర్మన్ నూతి శ్రీకాంత్ ప్రతినిధుల అభ్యర్థనలను శ్రద్ధగా వినిపించుకుని సమస్యలను పరిశీలించనున్నట్లు హామీ ఇచ్చినట్లు సమాచారం. రుణాల విడుదల ప్రక్రియపై స్పష్టత వచ్చేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని చైర్మన్ తెలిపినట్లు సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు చెప్పారు.



# మల్లాపూర్‌లో ప్రభుత్వ స్థలాన్ని కబ్జా ప్రయత్నం

**కలెక్టర్‌కి వినతి పత్రం సమర్పించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**మల్లాపూర్, నవంబర్ 13 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం మల్లాపూర్ లో సర్వే నం.110లోని 300 గజాల ప్రభుత్వ స్థలాన్ని 1996లో అప్పటి ప్రభుత్వం ఆదేశాల మేరకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నవోదయ మహిళా మండలికి కేటాయించారు. ఆ స్థలంలో కాప్రా మున్సిపాలిటీ శాశ్వత భవనం నిర్మించింది.భవనం నిర్మాణం అనంతరం మిగిలిన ఖాళీ స్థలంలో ప్రహరి గోడ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అయితే ఇటీవల కొందరు వ్యక్తులు తప్పుడు పత్రాలు సృష్టించి ఆ స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని స్థానికులు తెలిపారు.ఈ నేపథ్యంలో స్థలాన్ని కబ్జాదారుల నుంచి రక్షించి, ప్రజల అవసరాలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి ఐఏఎస్ కి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, పి.జి. సుదర్శన్, రాజేష్, గున్న, రఘు తదితరులు పాల్గొన్నారు.



# చోరీ కేసులను చేధించిన వేలేరు పోలీసులు

**వేలేరు,నవంబర్13(తెలంగాణ ముచ్చట్లు):**

వేలేరు మండలం మల్లికుదుర్ల గ్రామంలో కొంతకాలంగా జరుగుతున్న దొంగతనాలపై ప్రత్యేక నిఘా పెట్టిన పోలీసులు చివరకు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. మండలకేంద్రంలో ఎల్లమ్మ వాగు వద్ద అనుమానాస్పదంగా వెళ్లిన కారును ఆపడానికి ప్రయత్నించగా వాహనంలో ఉన్న వ్యక్తులు పారిపోవడంతో పోలీసులు వెంటపడి పట్టుకున్నారు. విచారణలో మండలం అంతటా జరుగుతున్న గొర్ల దొంగతనాలకు తాము పాల్పడినట్లు నిందితులు ఒప్పుకున్నట్లు సమాచారం. మల్లికుదుర్ల గ్రామానికి చెందిన బొజ్జ రాజు గొర్ల కొట్టంలో రెండు సార్లు దొంగతనం చేసినట్లు, గతంలో అబ్దుల్ నాగారం గ్రామంలోనూ ఇలాంటి ఘటనల్లో పాల్గొని జైలు శిక్ష అనుభవించి విడుదలైన తర్వాత మళ్లీ దొంగతనాలకు ఒడిగట్టినట్లు వెల్లడించారు. గండికోట సతీష్, గుంటపల్లి రాజా ఫణీంద్ర, గణపురం సాయిచరణ్, భూక్యా ఈశ్వర్, పెంటగాని శివ పేర్లతో గుర్తించిన నిందితుల వద్ద నుంచి రెండు లక్షల రూపాయలు, కారు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. నిందితులను అరెస్టు చేసి కేసు దర్యాప్తు సాగిస్తున్నారు.



# కాప్రాలో బి.టి. రహదారి నిర్మాణం

- **భక్తుల సౌకర్యానికి పరమేశ్వర్ రెడ్డి చొరవ**

**కాప్రా, నవంబర్ 13 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ లో కాప్రా ఎంఆర్ఓ కార్యాలయం నుండి కాప్రా బొడ్రాయి వరకు బి.టి. రహదారి నిర్మాణం చేపట్టిన ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి కి శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయ ధర్మకర్తల మండలి సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

కాప్రాలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయానికి వెళ్లే ప్రధాన రహదారి గుంతలు, గతుకులతో దెబ్బతినడంతో భక్తులు, వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కార్తీకమాసం కావడంతో భక్తుల రాకపోకలకు తీవ్ర అసౌకర్యం కలుగుతుందని దేవాలయ ధర్మకర్తల మండలి సభ్యులు గత నెలలో పరమేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు.భక్తుల సమస్యను గుర్తించిన పరమేశ్వర్ రెడ్డి వెంటనే స్పందించి సంబంధిత ఉన్నతాధికా రులకు తెలియజేసి, ప్రత్యేక నిధులు మంజూరు చేయించి రహదారి పనులు చేపట్టించారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు,మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్ పర్యవేక్షణలో కాప్రా మండల్ తహసీల్దార్ కార్యాలయం నుండి కాప్రా బొడ్రాయి వరకు బి.టి. రహదారి నిర్మాణం పూర్తయింది.దీంతో భక్తులు, వాహనదారులు, ప్రజలు సౌకర్యవంతంగా ప్రయాణించగలుగుతున్నారని హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయ ధర్మకర్తల మండలి సభ్యులు కాప్రా పట్టణ ప్రజల తరపున పరమేశ్వర్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు విఠల్ నాయక్, దేవాలయ ట్రస్టు సభ్యులు పడమటి మల్లారెడ్డి, పబ్బతి నరేందర్ గౌడ్, పొట్టు బాబురావు, పి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# ధాన్యం కొనుగోళ్లను మరింత వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- సెంటర్లలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలి

**ఎల్కతుర్తి, నవంబర్ 13 (తెలంగాణ ముచ్చట్లు):**

హనుమకొండ జిల్లా పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సంబంధిత అధికారులను ఆదేశించారు.
గురువారం కలెక్టర్ ఎల్కతుర్తి మండలం సూరారం, ఎల్కతుర్తి ఐకెపి ఆధ్వర్యంలో నడుస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.
సూరారం గ్రామంలోని సెంటర్లో రికార్డులను పరిశీలించి, ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు తెలుసుకున్నారు. అయితే, సెంటర్లో తాగునీరు, నీడ వంటి కనీస వసతులు లేవని గమనించిన కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడంపై నిర్వాహకులను ప్రశ్నించారు.
తరువాత ఎల్కతుర్తి కేంద్రాన్ని సందర్శించి ధాన్యం కొనుగోలు పరిస్థితులను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారికి ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.
ఈ సందర్భంగా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలి. తేమశాతం పరిశీలించి మాత్రమే కొనుగోలు చేయాలి. వ్యవసాయ విస్తరణ అధికారులు టోకెన్ ఇచ్చిన తర్వాతనే సెంటర్ నిర్వాహకులు కొనుగోలు చేయాలి," అని ఆదేశించారు.
ప్రతి సెంటర్లో తాగునీరు, నీడ, టార్పాలిన్ కవర్లు తప్పనిసరిగా ఉండాలని, గన్ని సంచులు సరిపడా నిల్వ ఉంచాలని, అవసరమైతే వెంటనే ఏపీవో ద్వారా ఇండెంట్ ఇవ్వాలని, కనీస మద్దతు ధర, తేమశాతం, ఫిర్యాదు నంబర్ వంటి వివరాలతో బ్యానర్ తప్పనిసరిగా ప్రదర్శించాలని సూచించారు. రైతులు ధాన్యం తరలింపుకు ఖర్చు చేయకూడదని, కొనుగోలు పూర్తయిన వెంటనే ప్యాడి ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్ల ద్వారా రైస్ మిల్లులకు తరలించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మేన శ్రీను, సివిల్ సప్లై కార్పొరేషన్ మేనేజర్ మహేందర్, తహసిల్దార్ ప్రసాదరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

# నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్న ఇందిరమ్మ ఇళ్లు

**మాట మేరకు ఇందిరమ్మ ఇల్లు**

**ఖమ్మం బ్యూరో, నవంబర్ 13, తెలంగాణ ముచ్చట్లు;**

దశాబ్ద కాలంగా నిరీక్షించిన నేరవేరని కల.. నేడు ప్రజా పాలనలో ఇందిరమ్మ ప్రభుత్వం నిరుపేదల సొంత ఇంటి కల నెరవేరుస్తున్న తరుణానా, తన అభిమాన నాయకుడు, పేదల పెన్నిధి మధిర నియోజకవర్గ ముద్దుబిడ్డ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఖమ్మం జిల్లా ముదిగొండ మండలంలోని గంధసిరి గ్రామంలో పెనుగొండ శివ కృష్ణ, నాగమణి ల ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలించారు. నాడు పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో మాకు ఇళ్ళు లేదని మీకు చెప్పుకున్నామని.. మన ప్రభుత్వం రాగానే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తా అని మాట ఇచ్చారు.. ఇచ్చిన మాట ప్రకారం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యింది అని చెప్పారు. బిల్లులు సకాలంలో చెల్లిస్తున్నారా అని లబ్ధిదారులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అడిగారు. సకాలంలో ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు వస్తున్నాయి అని చెప్పారు. మా అభిమాన నాయకులు మీరు మా ఇంటికి రావడం.. చెప్పలేని ఆనందం అని..మా జన్మ ధన్యమైంది అని సంతోషం వ్యక్తం చేశారు.



## ఉదయించే కిరణాలు బాలలు

ఉదయించే కిరణాలు బాలలు
బడికి వెలుగులు బాలలు
చదువుల తల్లి బిడ్డలు
చిరునవ్వుతో చిందులేస్తుండే బాలలు
సంతోషానికి మారుపేరు బాలలు!!

ప్రగతికి బాటలు బాలలు
భరతమాత ముద్దుబిడ్డలు
ఎదుగుతున్న పిల్లలు
భావితరానికి వెలుగు దివ్వెలు!!

బాలలు బంగారు కిరణాలు
అవనిలో వెలిసిన చిరు మొగ్గలు
స్వచ్ఛమైన మనసుకు చిరునామా
బంగారు భవితకు పునాదులు
చిరునవ్వుకు చిరునామా బాలలు!!

బాలల దినోత్సవం, నవంబర్ 14 సందర్భంగా..



**రచన:-**
**దేవులపల్లి రమేశ్**
**సిద్దిపేట,నంగునూర్**
**చరవాణి :-9963701294**

# నాణ్యమైన విత్తనం ఎంచుకుని అధిక ఉత్పత్తి సాధించండి

- అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల డీన్ కె హేమంత్ కుమార్.

**ఖమ్మం బ్యూరో,నవంబర్13, తెలంగాణ ముచ్చట్లు;**




వైరా: రైతులు నాణ్యమైన విత్తనాల ఎంపిక ద్వారా అధిక ఉత్పత్తులు సాధించాలని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల డీన్ కె హేమంత్ కుమార్ రైతులకు విజ్ఞప్తి చేశారు. గురువారం వైరా మండలం గొల్లపూడి గ్రామం లో కృషి విజ్ఞాన కేంద్రం, వైరా వ్యవసాయ శాఖ ఆద్వర్యంలో వరి క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. వైరా డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు తుమ్మలపల్లి కరుణశ్రీ మాట్లాడుతూ రైతులు నాణ్యమైన విత్తన ఎంపిక తో అధిక దిగుబడి సాధించ వచ్చని అన్నారు. గొల్లపూడి గ్రామం లో రైతులు సాగు చేసిన డబ్ల్యు జి ఎల్ 44 రకం వారిని వారు సందర్శించారు. ఈ రకం వరి ధాన్యం సాంబమసూరి రకాన్ని పోలి ఉంటుందని, 10,15 సెంటీమీటర్ల ఎత్తు అధికంగా ఉంటుందని వివరించారు. విత్తన మొక్క జొన్న సాగు చేసే రైతులు విత్తన కంపెనీ,లేదా ఆ కంపెనీ ఏజంట్ల తో పక్కాగా అగ్రిమెంట్ చేసుకుని మాత్రమే విత్తన కొని సాగుచేయాలని స్పష్టం చేశారు . అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల డీన్ కె హేమంత్ కుమార్ మాట్లాడుతూ రైతులు ఎప్పటికప్పుడు నాణ్యమైన విత్తన ఎంపికతో అధిక దిగుబడి సాధించ వచ్చని అన్నారు. ఈ సమయం లో వరిని ఆశించిన అగ్గితెగులు, బ్యాక్టీరియా ల నివారణకు అవసరమైన మందులను సూచించారు. కార్యక్రమం రైతులు మేడూరి రామారావు, తాతా నాగేశ్వరరావు, ఎస్ కె సైదా , కుంటముక్కల ఆనంద్, అమర్నేని రాఘవయ్య, తదితరులు పాల్గొన్నారు.

# రాయల్పార్లమెంట్ హౌస్‌లో శీతాకాల సమావేశానికి సిద్ధత సమావేశం



భారత ఉపరాష్ట్రపతి సీ.పీ. రాధాకృష్ణన్ ఈరోజు రాజ్యసభ ఉప చైర్మన్ శ్రీ హరీవంశ్, కార్యదర్శి జనరల్‌తో కలిసి ఔత్సాహికంగా రాయల్పార్లమెంట్ హౌస్‌లో సమావేశం నిర్వహించారు. వచ్చే శీతాకాల సభకు సమగ్రంగా ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. సభకు సంబంధించిన తీర్పులు, ప్రస్తావనలు, ప్రశ్నోత్తరాలు, రోజూ నిడివులు వంటి అంశాలపై ప్రశ్నించడంతో పాటు సభ్యుల నగదులు, భద్రతా చర్యలు, ప్రిజింగ్ అనుభవాలు మొదలైన అంశాలను చర్చించారు. సమావేశంలో పార్లమెంటు కార్యకలాపాల సమయాన్ని సమీక్షించడం, సభ్యుల పంపిణీ సంఖ్యలను పరిశీలించడం జరుగింది. రాజ్యసభలో సమయపాలన, సమావేశాల సమర్థ నిర్వహణ, ప్రభుత్వ-విపక్ష సమన్వయం వంటి అంశాలు చంద్రార్ధంగా పరిశీలబడ్డాయి. శీతాకాల సమావేశంలో సక్రమంగా చట్టపరమైన అంశాలు జరుగేందుకు ఏర్పాట్లు పూర్తి స్థాయిలో ఉండాలని అధికారులు తెలిపారు. ఈ సమావేశం ద్వారా పార్లమెంటు రాష్ట్రవ్యవస్థలో నాణ్యతను పెంచడానికి కీలక అడుగుగా నిలిచే అవకాశం ఉంది. సభ్యుల చురుకైన పాత్ర, వైవిధ్యభరిత చర్చలు, సమగ్ర నిర్ణయాలు ఈ శీతాకాల సమావేశంలో కనిపించే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# చిన్నారుల చేతుల్లోనే భవిష్యత్తు నిర్మాణం

- బాలదినం – 14 నవంబర్: పిల్లల హక్కుల పరిరక్షణకు సమాజం ముందుకు నడవాలి
- పిల్లల హక్కులపై పెరుగుతున్న అవసరం
- విద్య–సంక్షేమం దేశ అభివృద్ధి మూలం



ప్రతి సంవత్సరం నవంబర్ 14ను బాలదినంగా జరుపుకోవడం భారతదేశానికి ఒక సాంప్రదాయం మాత్రమే కాదు. పిల్లలపట్ల సమాజం కలిగి ఉండాల్సిన నైతిక బాధ్యతను గుర్తు చేసే రోజు కూడా. జవాహర్‌లాల్ నెహ్రూ జన్మదినం సందర్భంగా జరిగే ఈ వేడుక చిన్నారులపై ప్రేమను మాత్రమే కాదు, వారి హక్కుల పరిరక్షణను, వారి భవిష్యత్తును కాపాడాల్సిన అవసరాన్ని దేశానికి గుర్తుచేస్తుంది. పిల్లలు సురక్షితంగా పెరిగే ప్రతి అడుగు దేశ అభివృద్ధికి నేరుగా దోహదపడుతుంది.
ఇప్పటికీ భారతదేశంలో చిన్నారులు ఎదుర్కొనే సమస్యలు తక్కువ కావు. బాలకార్మికం, బాల్యవివాహాలు, విద్యా లభ్యతలో అసమానతలు, శారీరక మానసిక వేధింపులు వంటి సమస్యలు సమాజాన్ని ఆలోచింపజేస్తున్నాయి. బాలదినం సందర్భంగా ఈ సమస్యలపై ప్రజల్లో అవగాహన పెంచడం అత్యంత అవసరం. పిల్లల హక్కులు ప్రసంగాలకే పరిమితం కాకుండా, వాటిని అమలు చేసే దిశలో ప్రభుత్వం, సంస్థలు, కుటుంబాలు మూడు విభాగాలూ కలిసి ముందుకు సాగాలి.
విద్య చిన్నారి జీవితాన్ని మార్చే గొప్ప ఆయుధం. నాణ్యమైన విద్య చిన్నారులను మాత్రమే కాకుండా వారి కుటుంబాలను కూడా అభివృద్ధి దిశగా తీసుకెళ్తుంది. ప్రభుత్వం చే3పడుతున్న విద్యా సంస్కరణలు, డిజిటల్ లెర్నింగ్ అవకాశాలు, స్కూల్ మౌలిక సదుపాయాల బలోపేతం వంటి చర్యలు ఈ దిశలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. విద్యను హక్కుగా ప్రకటించడం కంటే, ప్రతి చిన్నారి దాన్ని నిజంగా పొందేలా చూడటం మరింత ముఖ్యమైన బాధ్యత.




పిల్లల మానసిక ఆరోగ్య అంశం కూడా ఇటీవలి కాలంలో ప్రధాన చర్చగా మారుతోంది. ఒత్తిడి, పోటీ, సామాజిక ఒత్తిళ్లు చిన్నారులపై ప్రభావం చూపుతుండటంతో, పాఠశాలలు కౌన్సెలింగ్ సదుపాయాలు, స్నేహపూర్వక నేర్పు విధానాలు అమలు చేయాల్సిన అవసరం ఉంది. కుటుంబాలు కూడా పిల్లల భావోద్వేగాలను అర్థం చేసుకుని, వారికి వినడానికి సమయం కేటాయించాలి. "పిల్లలు ప్రేమతో పెరుగుతారు" అనే భావనను సమాజం గుర్తుంచుకోవాలి.
పిల్లలపై జరుగుతున్న నేరాలను అరికట్టడం కూడా సమాజం మొత్తం బాధ్యత. బాలలపై దాడులు, దుర్వినియోగం వంటి ఘటనలకు చట్టపరమైన శిక్షలు మరింత కఠినంగా మారుతున్నా, అవగాహన లేకపోవడం, నిర్లక్ష్యం వంటి కారణాలు ఇంకా సమస్యగా ఉన్నాయి. ప్రతి ప్రాంతంలో అవగాహన కార్యక్రమాలు, పోలీసు సమాజ భాగస్వామ్యం, సురక్షిత పాఠశాల పరిసరాలు అవసరం. చిన్నారుల భద్రతను నిర్ధారించడం దేశ భవిష్యత్తును రక్షించే చర్యగా భావించాలి.
బాలదినం సందర్భంగా స్కూళ్లు, సంస్థలు, సమాజ సేవా సంస్థలు పిల్లల కోసం ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, అవగాహన సమావేశాలు నిర్వహిస్తాయి. ఇవి పిల్లల ప్రతిభను వెలికితీత కాదు, వారిలో కొత్త నమ్మకం, ఉత్సాహం, సామాజిక అవగాహన కలిగిస్తాయి. కుటుంబాలు కూడా పిల్లల కోసం చిన్న వేడుకలు ఏర్పాటు చేయడం, వారి కలలను ప్రోత్సహించడం, వారి భావాలను వినడం వంటి చర్యలు చేయవచ్చు. ఈ ప్రత్యేక దినం అవకాశమే కాదు ఒక సందేశం కూడా. "ప్రతి పిల్లకు ప్రతి హక్కు" అనే నినాదం కేవలం మాట కాదు; అది ఒక దేశం భవిష్యత్తు ఎలా ఉండాలో చూపించే దారి. ఆరోగ్యం, విద్య, రక్షణ, సమానత్వం ఇవన్నీ పిల్లలకు హక్కులుగానే కాక అభివృద్ధి మార్గాల్లోని మెట్లుగా కూడా గుర్తించాలి. పిల్లల భవిష్యత్తు బలంగా ఉంటేనే దేశ భవిష్యత్తు ప్రకాశిస్తుంది.
ఈ బాలదినం మనందరికీ ఒక స్పష్టమైన గుర్తు.. చిన్నారుల పట్ల బాధ్యతను ప్రతి కుటుంబం, ప్రతి ఉపాధ్యాయుడు, ప్రతి పౌరుడు ఆచరణలో చూపాలి. పిల్లలు నేడు నవ్వితేనే రేపటి భారతం వెలుగుతుంది.

## కారు తనిఖీ చేసిన పోలీసులు... డిక్కీలో నిద్రిస్తున్న వ్యక్తిని చూసి షాక్

దేశ రాజధాని ఢిల్లీలో ఇటీవల జరిగిన కారు పేలుడు ఘటన తర్వాత భద్రతా విభాగాలు అప్రమత్తమయ్యాయి. అన్ని చెక్‌పోస్టుల వద్ద వాహనాల తనిఖీలు కఠినతరం చేస్తున్న పోలీసులు, ఒక కారును ఆపి సాధారణ తనిఖీ చేపట్టగా ఆశ్చర్యకర ఘటన వెలుగులోకి వచ్చింది. ఆ కారు డిక్కీ తెరిచిన అధికారులు అందులో ఓ వ్యక్తి నిద్రిస్తుండటం చూసి ఒక్కసారిగా అవాక్కయ్యారు. నవంబర్ 10న ఎర్రకోట సమీపంలో జరిగిన కారు పేలుడు దేశవ్యాప్తంగా కలకలం రేపిన నేపథ్యంలో సిగ్నేచర్ బ్రిడ్జ్ చెక్‌పాయింట్ వద్ద తిమార్పూర్ పోలీసులు వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో పెళ్లి వేడుక నుంచి తిరిగి వస్తున్న కుటుంబ సభ్యులు ప్రయాణిస్తున్న కారును ఆపారు. ప్రయాణికులు నవ్వుతూ కిందకు దిగినా, విచిత్ర దృశ్యం డిక్కీ తెరిచినప్పుడు బయటపడింది. కారులో సీట్లు అందుబాటులో లేకపోవడంతో బంధువైన ఓ వ్యక్తి డిక్కీలో సర్దుకుని పడుకున్నట్లు పోలీసులు తెలుసుకున్నారు. అతడు లోపలే నిద్రపోయిన సంగతి వారికి తెలియకుండా ప్రయాణం సాగుతుండటమే ఈ ఆసక్తికర పరిస్థితికి కారణమైంది. పోలీసులు అతడిని హెచ్చరించి, ఇకపై ఇలాంటి ప్రమాదకర ప్రయాణం చేయొద్దని సూచించి వదిలేశారు.

# తెలంగాణ హృదయాన్ని పలికించిన మహానుభావుడు కాళోజీ నారాయణరావు

- విముక్తి, స్వరాజ్యం, స్వీయ గౌరవం కోసం నిరంతరం కలం–గళంతో పోరాటం
- వర్ధంతి సందర్భంగా తెలంగాణ ఆత్మను మలిచిన వ్యక్తిత్వానికి వినమ్ర నివాళి



తెలంగాణ మట్టిలో పుట్టిన ప్రతి మనిషి హృదయాన్ని తాకే ఒక పేరు కాళోజీ నారాయణరావు. ఈ పేరు ఒక కవి పేరు మాత్రమే కాదు, ఒక భావజాలం, ఒక గళం, ఒక ఉద్యమం. సమాజంలోని సాధారణ మనుషుల కష్టాలు తన రక్తనాళాల్లో పరిగెత్తుతున్నాయన్నట్టు ఆయన రచనలు, ఆయన మాటలు, ఆయన పోరాటం సాగాయి. వర్ధంతి సందర్భంగా కాళోజీని స్మరించుకోవడం అంటే, తెలంగాణ ఆత్మను మరోసారి గుర్తుకు తెచ్చుకోవడం. తెలంగాణలో "ప్రజాకవి"గా పొందిన గౌరవం ఆయనకిదే ప్రత్యేకం. కాళోజీ మాటలలో మట్టి వాసన ఉంటుంది, యాసలో మనిషి గుండె ఉప్పొంగుతుంది. చదువు పెద్దది, పదవులు పెద్దవి కాకపోయినా సామాన్యుడి మాటే గొప్పదని ఆయన జీవితమే నిరూపించింది. గ్రామాల్లోని బతుకు బండిలో నలిగిపోయే మహిళా కష్టాలు, కూలీల దైన్య స్థితి, రైతుల అనిశ్చిత జీవితం ఇవన్నీ కాళోజీ కవిత్వంలో స్పష్టంగా వినిపిస్తాయి. ఆ లయలో, ఆ యాసలో తెలంగాణ మట్టి దాగి ఉంటుంది. హైదరాబాద్ విముక్తి ఉద్యమం, నిరంకుశత్వానికి వ్యతిరేకంగా సాగిన పోరాటాలు, సామాజిక సంస్కరణలు ఎక్కడ ప్రజలకు ధైర్యం అవసరమైతే, అక్కడ కాళోజీ నిలిచారు. ఒక చేతిలో కలం, మరో చేతిలో ధైర్యం ఈ రెండు ఆయుధాలతోనే ఆయన ఆత్మవిశ్వాసాన్ని విస్తరించారు. ఒత్తిడులు వచ్చినా, నిషేధాలు వచ్చినా, పత్రికలు మూతపడినా, సమావేశాలు ఆపినా కాళోజీ స్వరం మాత్రం ఆగ లేదు.
తెలంగాణ ఉద్యమ చరిత్రలో ఆయన పాత్ర ప్రస్తావన లేకుండా ఏ అధ్యాయమూ పూర్తికాదు. "నా తెలంగాణ కోటి రత్నాల వీణ" అంటూ ఆ భావాన్ని పదాల్లో బంధించిన కాళోజీ, ఈ నేల పట్లున్న తన ప్రేమను ప్రపంచానికి వినిపించారు. ప్రజాస్వామ్యం అనేది పండగరోజుల్లో మాత్రమే కాదు, ప్రతి రోజూ సాధించాల్సిన హక్కని ఆయన చూపించారు. ఆయన మాటలో నిజం, ఆయన వ్యతిరేకంలో అంకితభావం, ఆయన సరస్వతిలో నిరాడంబరత ఇవన్నీ కలిసి కాళోజీని మహానుభావుడిగా నిలబెట్టాయి. ఆయన జీవితం ఒక పాఠం: సామాన్యుడి కోసం మాట్లాడితే, సమాజం ముందుకు నడుస్తుంది. ఆయన కవిత్వం ఒక నినాదం: నిజంw చెప్పడానికి యాస ఉన్నా భయం ఉండకూడదు.
ఆయన పోరాటం ఒక దిశ: అన్యాయం కనిపిస్తే, ఎదిరించడం మన ధర్మం.
ఈ వర్ధంతి సందర్భంగా, కలం చేత పట్టి ప్రజల కోసం పోరాడటం ఏంటో తెలుసుకోవాలంటే కాళోజీ పుస్తకాలు తెరవాలని, మన రోజువారీ జీవితంలో ఆయన చూపిన ధైర్యాన్ని అనుసరించాలని తెలంగాణ ప్రజలు భావిస్తున్నారు. ఆయన వెళ్లిపోయినా, ఆయన గళం మాత్రం ఈ మట్టిలో శాశ్వతం.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# వాహనదారులకు బిగ్ అలర్ట్..

## ఈనెల 15 నుండి టోల్ ప్లాజాలలో పెద్ద మార్పులు!



మీరు తరచుగా హైవేలపై ప్రయాణిస్తుంటే ఈ వార్త మీకు చాలా ముఖ్యమైనది. నవంబర్ 15, 2025 నుండి టోల్ ప్లాజాలలో కొత్త నిబంధన అమలు చేయనున్నారు. ఇది మీ జేబుపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుంది. మీ వాహనంపై ఫాస్ట్ ట్యాగ్ లేకపోతే లేదా ట్యాగ్ విఫలమైతే మీరు భారీ జరిమానాను ఎదుర్కోవలసి ఉంటుంది. అయితే డిజిటల్ చెల్లింపులు చేసే వారికి ప్రభుత్వం గణనీయమైన మినహాయింపును ప్రకటించింది.

కొత్త నియమం ఏమిటి?

కేంద్ర ప్రభుత్వం 2008 నాటి జాతీయ రహదారి రుసుము నిబంధనలను సవరించి కొత్త నిబంధనను అమలు చేసింది. ఈ నిబంధన ప్రకారం.. ఒక డ్రైవర్ చెల్లుబాటు అయ్యే ఫాస్ట్ ట్యాగ్ లేకుండా టోల్ ప్లాజాలోకి ప్రవేశించి నగదుతో చెల్లిస్తే, వారి నుండి టోల్ రుసుము రెట్టింపు వసూలు చేయనున్నారు. అయితే అదే డ్రైవర్ యూపీఐ లేదా డిజిటల్ మాధ్యమాన్ని ఉపయోగించి చెల్లిస్తే వారు టోల్ రుసుము కంటే 1.25 రెట్లు మాత్రమే చెల్లించాలి. పర్యవసానంగా డ్రైవర్లు ఇప్పుడు నగదుతో కంటే డిజిటల్ చెల్లింపులతో తక్కువ చెల్లిస్తారు. మీ వాహనం టోల్ రుసుము రూ.100 అనుకుందాం. మీ ఫాస్ట్ ట్యాగ్ పనిచేస్తుంటే అది రూ.100 మాత్రమే అవుతుంది. మీ ఫాస్ట్ ట్యాగ్ విఫలమైతే, మీరు నగదుతో చెల్లిస్తే మీరు రూ.200 చెల్లించాలి. మీ ఫాస్ట్ ట్యాగ్ విఫలమైతే, మీరు యూపీఐతో చెల్లిస్తే మీరు రూ.125 చెల్లించాలి. దీని అర్థం డిజిటల్ చెల్లింపులకు ఇప్పుడు ప్రత్యక్ష ఉపశమనం లభిస్తుంది. అయితే నగదు లావాదేవీలు ఎక్కువ చెల్లించాల్సి ఉంటుందని గుర్తించుకోండి.

ప్రభుత్వం ఈ మార్పు ఎందుకు చేసింది?

కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ ప్రకారం.. ఈ సవరణ ఉద్దేశ్యం టోల్ వసూలు వ్యవస్థను పారదర్శకంగా మార్చడం, నగదు లావాదేవీలను తగ్గించడం, డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించడం. ఈ చర్య టోల్ ప్లాజాల వద్ద పొడవైన క్యూలను తగ్గించడమే కాకుండా ప్రయాణికులకు వేగవంతమైన, సున్నితమైన ప్రయాణ అనుభవాన్ని అందిస్తుందని మంత్రిత్వ శాఖ చెబుతోంది.

ఎవరు ఎక్కువ ప్రయోజనం పొందుతారు?

ఈ మార్పు ముఖ్యంగా ఏదైనా కారణం చేత ఫాస్ట్ ట్యాగ్ స్కాన్ చేయలేని లేదా ట్యాగ్ గడువు ముగిసిన డ్రైవర్లకు ప్రయోజనకరంగా ఉంటుంది. గతంలో వారు డబుల్ టోల్ చెల్లించవలసి వచ్చేది. కానీ ఇప్పుడు వారు యూపీఐ ద్వారా చెల్లించడం ద్వారా ఉపశమనం పొందుతారు

# 1 రూపాయికే ఫ్లైట్ టికెట్..

## ఇండిగో ఇన్‌ఫాంట్ సేల్.. నవంబర్ 30 వరకు ఎక్కడికైనా వెళ్లొచ్చు!




విమాన ప్రయాణం అంటేనే టికెట్ ధరలు వేలు, లక్షల్లో ఉంటాయి. సామాన్యులకు ఖర్చుతో కూడుకున్న పని. చిన్న పిల్లలకైనా టికెట్ కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఇది పసి పిల్లలు ఉన్న తల్లిదండ్రులకు అదనపు భారమని చెప్పాలి. అమ్మ ఒడిలో ఆడుకునే పిల్లలతో ప్రాయాణం చేసిన వారికీ టికెట్ కొనాల్సి వస్తుంది. పసి పిల్లలను వదిలేసి ప్రయాణం చేయడం కుదరదు. వారిని తప్పకుండా తీసుకెళ్లాల్సిందే. దీంతో అదనంగా భారం పడుతుంది. ఈ క్రమంలో దేశీయ దిగ్గజ ఎయిర్‌లైన్స్ కంపెనీ ఇంటర్ గ్లోబ్ ఏవియేషన్ (ఇండిగో) మరోసారి భారీ డిస్కౌంట్ ఆఫర్ తీసుకొచ్చింది. పసి పిల్లలు ఉన్న తల్లిదండ్రులు భారీగా ఆదా చేసుకునేందుకు అవకాశం ఇస్తోంది. దాదాపు రూ.1750 మేర ఆదా చేసుకోవచ్చని చెబుతోంది. కేవలం 1 రూపాయికే విమాన ప్రయాణం కల్పిస్తోంది. పసి పిల్లల కోసం ఇన్ఫాంట్ ఫ్లైట్ రూ.1 పేరుతో స్పెషల్ సేల్ అందిస్తోంది. ఈ స్పెషల్ సేల్ వివరాలు తెలుసుకుందాం.0 24 నెలల వయసు గల పిల్లలకు ఒక్క రూపాయికే విమాన ప్రయాణం కల్పిస్తున్నట్లు ఇండిగో ఎయిర్‌లైన్స్ తన అధికారిక వెబ్‌సైట్లో ఆఫర్ వివరాలు వెల్లడించింది. అయితే నేరుగా ఇండిగో అధికారిక వెబ్‌సైట్ నుంచి టికెట్లు బుక్ చేసుకుంటేనే ఆ ఆఫర్ వర్తిస్తుందని స్పష్టం చేసింది. 1 రూపాయితో టికెట్ కొనుగోలు చేసిన తల్లిదండ్రులు చెక్ ఇన్ పాయింట్ వద్ద పిల్లల వయసు ధ్రువీకరణ కోసం వాలిడ్ డాక్యుమెంట్లు బర్త్ సర్టిఫికెట్, వ్యాక్సినేషన్ సర్టిఫికెట్, హాస్పిటల్ డిశ్చార్జ్ కార్డ్, పాస్‌ట్‌పోర్ట్ వంటివి చూపించాలి. ఒకవేళ సరైన వయసు ధ్రువీకరణ పత్రాలు లేకుంటే టికెట్ రేటు మొత్తం కట్టాల్సి ఉంటుంది. ఈ ఆఫర్ నవంబర్ 30, 2025 వరకు ఉంటుందని ఇండిగో వెల్లడించింది. దేశీయ విమానాల్లో ఎక్కడికైనా ప్రయాణించవచ్చని, తన అధికారిక వెబ్‌సైట్లో డీల్స్ అండ్ ఆఫర్స్ విభాగంలో ఆఫర్ వివరాలు పేర్కొంది. ' పసి పిల్లలతో ప్రయాణమంటే పెద్ద సవాలే. అలాగని వారిని వదిలేసి ప్రయాణం చేయలేం. అందుకే మీకు మేము అన్ని విధాలుగా మద్దతు ఇస్తున్నాం. 3 రోజుల నుంచి 2 సంవత్సరాల లోపు వయసు గల పిల్లలకు ఇన్ఫాంట్ కేటగిరీలో ప్రయాణం కల్పిస్తున్నాం. చెక్ ఇన్ టైంలో వయసు ధ్రువీకరణ పత్రాలు కచ్చితంగా చూపించాలి.' అని ఇండిగో ఎయిర్ లైన్స్ వెల్లడించింది. ఎయిర్ బస్ ఏ320 విమానాల్లో గరిష్ఠంగా 12 మంది మాత్రమే పసి పిల్లలు ప్రయాణించవచ్చని తెలిపింది. ఏటీఆర్ విమానాల్లో గరిష్ఠంగా 6 మంది పిల్లలకు మాత్రమే అనుమతి ఉంటుందని తెలిపింది. ఒక విమానంలో ఒక వ్యక్తితో ఒక పిల్లవాడు మాత్రమే ఉండాలని కండీషన్ పెట్టింది. ఈ ఇన్‌ఫాంట్ ఆఫర్ గురించిన పూర్తి వివరాలు తెలుసుకునేందుకు ఇండిగో అధికారిక వెబ్‌సైట్ చూడాలని తెపింది.

# పీఎఫ్ విత్ డ్రా చేస్తున్నారా?

## -34% ట్యాక్స్ తప్పించుకొని రూపాయి ట్యాక్స్ లేకుండా తీసుకునే చాన్స్!




ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలని డబ్బులను తీసుకునేందుకు నిబంధనలను సులభతరం చేసింది కేంద్రం. విత్ డ్రా చేసుకునే ఆప్షన్ల సంఖ్యనూ పెంచింది. అయితే, అత్యవసరం అయితే తప్పితే ఈపీఎఫ్ ఖాతాలోని డబ్బులను పదవీ విరమణ వరకు కొనసాగించాలని ఆర్థిక నిపుణులు చెబుతుంటారు. సాధారణంగా పీఎఫ్ అకౌంట్లో ఉండే డబ్బులు, దానిపై వచ్చే వడ్డీకి ఎలాంటి ట్యాక్స్ ఉండదు. కానీ, రిటైర్మెంట్‌కి ముందే విత్ డ్రా చేయకుండా నియంత్రించేందుకు ప్రభుత్వం ప్రీ విత్ డ్రాయల్ పై ట్యాక్స్ విధిస్తోంది. ఈ విషయం చాలా మందికి తెలియకపోవచ్చు. ఉద్యోగం మానేయడం లేదా వేరే కంపెనీకి మరడం వంటి సందర్భాల్లోనూ వెంటనే ఖాతాలోని డబ్బులు తీసుకుంటున్నారు. దీంతో ట్యాక్స్ కట్టాల్సి వస్తోంది. ఈపీఎఫ్ ఖాతాకు ఈఈఈ కేటగిరీలోకి వస్తుంది. అంటే కాంట్రిబ్యూషన్, వడ్డీ, మెచ్యూరిటీ మొత్తం మూడు రకాలగా పన్ను ఉండదు. ఇన్‌కమ్ ట్యాక్స్ యాక్ట్ 1961 ప్రకారం పాత పన్ను విధానంలో రూ.1.50 లక్షల వరకు డిపాజిట్‌పై ట్యాక్స్ మినహాయింపు లభిస్తుంది. ఇక కొత్త పన్ను విధానంలో అయితే యజమాని వాటాపైనే మినహాయింపు ఉంటుంది. రెండు విధానాల్లోనూ ఈపీఎఫ్ అకౌంట్లోని డబ్బులు, మెచ్యూరిటీ సొమ్ముకు పూర్తి పన్ను మినహాయింపు ఉంటుంది. అయితే, ఇది 5 సంవత్సరాలకు మించి సర్వీసు ఉన్నప్పుడు మాత్రమే వర్తిస్తుంది. అంటే ఉద్యోగంలో చేరి 5 సంవత్సరాల లోపు విత్ డ్రా చేస్తే ట్యాక్స్ కట్టాల్సి వస్తుంది.

**ఈపీఎఫ్ విత్ డ్రా రూల్స్ ఇవే..**

కనీసం 5 సంవత్సరాలు ఉద్యోగంలో కొనసాగనట్లయితే పీఎఫ్ డబ్బులు విత్ డ్రా చేసుకునే సమయంలో పన్ను వర్తిస్తుంది. ఉద్యోగం మారాలనుకున్నప్పుడు పీఎఫ్ ఖాతాను కొత్త కంపెనీకి బదిలీ చేసినట్లయితే రెండు కలిపి ఎంత కాలం ఉద్యోగం చేశారన్నది పరిగణనలోకి తీసుకుంటారు. మొత్తం 5 సంవత్సరాల కంటే ఎక్కువ కాలం ఖాతా కొనసాగితే ఎలాంటి ట్యాక్స్ ఉండదు.

ఈపీఎఫ్ ఖాతాలో 4 రకాలుగా డబ్బులు జమ అవుతాయి. యజమాని వాటా, ఉద్యోగి వాటా, సంస్థ చేసిన డిపాజిట్లపై వడ్డీ, ఉద్యోగి చేసిన డిపాజిట్లపై వడ్డీ వస్తుంటాయి. 5 ఏళ్ల కంటే తక్కువ కాలం ఖాతా కొనసాగితే ఉద్యోగి, సంస్థ డిపాజిట్ చేసిన మొత్తంతో పాటు వడ్డీ విత్ డ్రాపై ట్యాక్స్ కట్టాల్సి వస్తుంది. ఆదాయపు పన్ను శ్లాబు రేటు ప్రకారం ఈ ట్యాక్స్ ఉంటుంది. పాన్ కార్డు ఇస్తే 10 శాతం టీడీఎస్ వర్తిస్తుంది. పాన్ వివరాలు ఇవ్వకపోతే ఏకంగా 34.60 శాతం టీడీఎస్ కట్ చేస్తారు

# అంబానీ ఇంట్లో టీకప్పుల ఖరీదు షాక్..

ముఖేష్ అంబానీకి చెందిన ఆంటిలియా ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన ఇళ్లలో ఒకటి. ఇంటి ప్రతి మూలను ప్రపంచ స్థాయికి తీర్చిదిద్దారు. అసమానమైన సౌకర్యాలతో అమర్చారు. వంటగది విషయంలో కూడా అంబానీ కుటుంబం రాజీపడలేదు. దశాబ్దం న్నర క్రితం ఆంటిలియాకు వెళ్లే ముందు నీతా అంబానీ వంటగదిని సిద్ధం చేయడంలో ముందున్నారు. నీతా ప్రైవేట్ జెట్‌లో శ్రీలంకకు వెళ్లి వంటగదికి అవసరమైన పాత్రలను కొనుగోలు చేశారట. వంటగదికి సంబంధించిన వస్తువులను కొనుగోలు చేసేందుకు శ్రీలంకకు వెళ్లడం వెనుక ప్రత్యేక కారణం ఉంది. శతాబ్దాలకు పైగా సంప్రదాయం కలిగిన జపనీస్ పింగాణీ తయారీదారు నోరిటేక్ బ్రాండ్ నుండి ప్రత్యేకమైన ఉత్పత్తులను ఎంచుకోవడం లక్ష్యం. నోరిటేక్ బ్రాండ్ 22 క్యారెట్ల బంగారం లేదా ప్లాటినంతో తయారు చేసిన పింగాణీ పాత్రలకు ప్రసిద్ధి చెందింది. శ్రీలంక నుండి నీతా కొనుగోలు చేసిన టీ కప్పులు బంగారంతో తయారు చేయబడిన ప్రత్యేక డిజైన్లను కలిగి ఉన్నాయి. ఒక టీ కప్పు ధర దాదాపు $3600 (రూ. 3 లక్షలకు పైగా). అలాంటి టీ కప్పులు ఉన్న సెట్‌ను నీతా రూ. 15 కోట్లకు పైగా ఖర్చు చేసి కొనుగోలు చేసినట్లు కూడా నివేదికలు చెబుతున్నాయి. వంటగదికి అవసరమైన 25,000 టపాకాయల ముక్కలతో పాటు టీ సెట్‌ను శ్రీలంక నుండి కొనుగోలు చేసి ప్రైవేట్ జెట్ ద్వారా ముంబైకి తీసుకువచ్చారు. ఆంటిలియా సమీపంలో నోరిటేక్ బ్రాండ్ స్టోర్ ఉన్నప్పటికీ, ధర వ్యత్యాసాన్ని పరిగణనలోకి తీసుకుని శ్రీలంక నుండి నేరుగా కొనుగోలు చేయాలని నిర్ణయించుకున్నట్లు కూడా నివేదికలు ఉన్నాయి. నోరిటేక్ అతిపెద్ద తయారీ కేంద్రం శ్రీలంకలో ఉంది. బంగారం, ప్లాటినంతో అలంకరించిన 50 సెట్‌స్‌తో కలిగిన నోరిటేక్ డిన్నర్ సెట్ భారతదేశంలో $800, $2,000 మధ్య ఖర్చవుతుంది. శ్రీలంక నుండి కొనుగోలు చేసినప్పుడు దాని ధర $300 నుండి $500 మాత్రమే. ఈ విధంగా నీతా వంటకాలను సాపేక్షంగా తక్కువ ధరకు కొనుగోలు చేయగలిగింది. వంటగదిలో ఇన్ని పాత్రలు అవసరమవుతాయా అనేది సందేహాస్పదంగా అనిపించవచ్చు. కానీ ఆంటిలియా సాధారణ కార్యకలాపాలను పరిగణనలోకి తీసుకుంటే అది మితిమీరినది కాదు. కుటుంబ సభ్యులతో పాటు ఆంటిలియా 600 మంది సిబ్బంది కూడా ఇక్కడ భోజనం వండుతారు. ఈ వంటగది అత్యాధునిక సాంకేతిక పరికరాలు, సాంప్రదాయ వంట పద్ధతుల కలయికతో అమర్చబడి ఉంది. శాఖాహార ఆహారాన్ని మాత్రమే తయారు చేసినప్పటికీ, భారతీయ, విదేశీ శైలులను అవలంబిస్తారు.



# ఈ రైలులో వేడి నీటితో స్నానం ఫ్రీ!

రోజుకు లక్షలాది మంది ప్రయాణించే భారతీయ రైల్వే, ప్రయాణికుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని తమ సేవలను నిరంతరం మెరుగుపరుస్తోంది. ముఖ్యంగా చలికాలంలో ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా తగిన చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో దూర ప్రయాణాలకు వెళ్లే వారికి భారతీయ రైల్వే ఒక గొప్ప శుభవార్త చెప్పింది. దేశంలోనే అత్యంత ఆధునికమైన వందే భారత్ ఎక్స్‌ప్రెస్ యొక్క స్లీపర్ వెర్షన్‌లో త్వరలో ప్రయాణికులకు స్నానం చేయడానికి వేడి నీటి సదుపాయం అందుబాటులోకి రానుంది. ఈ అధునాతన సౌకర్యం వందే భారత్ ఎక్స్‌ప్రెస్ యొక్క స్లీపర్ వెర్షన్‌లో ప్రవేశపెట్టబడుతుంది. ఇప్పటికే వేగం మరియు అత్యాధునిక ఫీచర్లకు ప్రసిద్ధి చెందిన వందే భారత్ రైళ్లు, ఈ కొత్త సదుపాయంతో మరింత ఆకర్షణీయంగా మారనున్నాయి. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ యొక్క స్లీపర్ వెర్షన్‌లో ఈ ప్రత్యేక ఫీచర్ ప్రవేశపెట్టబడుతుంది. ఇప్పటికే వేగం, అత్యాధునిక ఫీచర్లకు ప్రసిద్ధి చెందిన వందే భారత్ రైళ్లు, ఈ కొత్త సదుపాయంతో మరింత ఆకర్షణీయంగా మారనున్నాయి. ఢిల్లీ నుండి కాశ్మీర్ లేదా దక్షిణ గమ్యస్థానాలు వంటి రాత్రిపూట ప్రయాణం అవసరమయ్యే సుదీర్ఘ మార్గాల్లో నడిచే వందే భారత్ స్లీపర్ రైళ్లలో ఈ హాట్ షవర్ సౌకర్యం ప్రయాణికులకు ఎంతగానో



**ఫస్ట్ ఏసీలో ఉచితం!**

ఈ సదుపాయం కోసం ప్రయాణీకులు ఎంత చెల్లించాలి అనే సందేహం అక్కర్లేదు. ఫస్ట్ ఏసీ ప్రయాణీకులకు ఈ వేడి నీటి స్నానపు సౌకర్యం పూర్తిగా ఉచితం. ఈ సేవ ఫస్ట్ ఏసీ ఛార్జీలోనే చేర్చుతారు. కాబట్టి అదనపు ఛార్జీ చెల్లించాల్సిన అవసరం లేదు. ఇతర కోచ్‌లు ఈ సేవలు అందుబాటులో ఉండవు. వందే భారత్ స్లీపర్ రైలుతో పాటు రాజధాని, దురంతో, ఇతర సూపర్ ఫాస్ట్ రైళ్ల వంటి కొన్ని ఎంపిక చేసిన ప్రీమియం రైళ్లలోని ఫస్ట్ ఏసీ కోచ్‌లలో కూడా ఇప్పటికే వేడి నీటి స్నానపు సదుపాయం అందుబాటులో ఉంది. భారతీయ రైల్వేలు ప్రయాణికులకు రైలు పట్టాలపై కూడా హోటల్ స్థాయి లగ్జరీ అనుభూతిని అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. ప్రస్తుతం ఆటోమేటిక్ డోర్లు, అధునాతన భద్రతా వ్యవస్థలు, ఇతర ప్రీమియం సేవలను అందిస్తున్న వందే భారత్ రైళ్లు, ఈ కొత్త ఫీచర్‌తో ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణంతో పాటు హోటల్ లాంటి సౌకర్యాలను కూడా అందిస్తున్నాయని రైల్వే అధికారులు తెలిపారు.

# ఇక వాట్సాప్ స్టేటస్‌లో స్పాటిఫై మ్యూజిక్..!




సంగీత ప్రియులకు గుడ్‌న్యూస్. మీకు ఇష్టమైన పాటలు, ఆల్బమ్, పాడ్‌కాస్ట్‌లను నేరుగా వాట్సాప్ స్టేటస్‌కు షేర్ చేసుకునే వీలుంటుంది. ఇందుకోసం వాట్సాప్ సరికొత్త ఫీచర్‌పై పని చేస్తుంది. స్పాటిఫై నుంచి మాత్రమే ఈ పాటలను నేరుగా షేర్ చేసుకునే వీలుంటుంది. ఇప్పటి వరకు ఫొటోలు, వీడియోలు మాత్రమే స్టేటస్‌గా పెట్టుకునే అవకాశం ఉండగా.. ఇకపై స్టేటస్‌లో పాటలు సైతం షేర్ చేసుకోవచ్చు. ప్రతి పాట, ఆల్బమ్, పాడ్‌కాస్ట్‌లో కొత్త షేర్ బటన్ ఉంటుందని స్పాటిఫై వెల్లడించింది. ఈ బటన్‌ని ట్యాప్ చేయడం వల్ల వాట్సాప్‌తో సహా మల్టిపుల్ షేరింగ్ ఆప్షన్స్ ఉంటాయని చెప్పింది. కేవలం ఒకే ట్యాప్‌తో మీకు ఇష్టమైన ట్రాక్‌ను నేరుగా వాట్సాప్‌కు జోడించవచ్చని చెప్పింది. ఈ ఫీచర్‌ని క్రమంగా అందుబాటులోకి తీసువస్తుంది. ప్రస్తుతం మొబైల్స్‌లో ఈ బటన్ కనిపిస్తుంది. ఎవరికైనా కనిపించకపోతే త్వరలోనే అందుబాటులోకి వస్తుందని పేర్కొంది. ఈ ఫీచర్ కేవలం మ్యూజిక్‌కు మాత్రమే పరిమితం కాకుండా స్టేటస్‌లో ఇష్టమైన పాడ్‌కాస్ట్, ఆడియో బుక్, స్పాటిఫై షోను సైతం షేర్ చేయొచ్చు. ఇది మీ ఫ్రెండ్స్, కుటుంబీకులు స్పాటిఫై యాప్‌లో మీ స్టేటస్‌ని నేరుగా పాటలు, పాడ్‌కాస్ట్‌ను వినేందుకు అనుమతి ఇస్తుంది. ఇకపై య్పాటిఫై ప్రతి పాట, షో కింద షేర్ బటన్ ఇస్తుంది. దానిపై ప్రెస్ చేసి వాట్సాప్ ఆప్షన్ ఎంచుకొని ఆపై మై స్టేటస్‌లోకి వెళ్లి వాట్సాప్ అకౌంట్‌కి పోస్ట్ చేయాలి. కొన్ని సెకన్లలోనే మీకు ఇష్టమైన ట్రాక్ స్టేటస్‌లో కనిపిస్తుంది. మీ కాంటాక్ట్స్ వినడానికి, చూసేందుకు అందుబాటులో ఉంటుంది. దీని కోసం ముందుగా మీ ఫోన్‌లో స్పాటిఫై యాప్‌ను ఓపెన్ చేయాలి. ఆ తర్వాత పాట, ఆల్బమ్, పాడ్‌కాస్ట్‌ను ఎంపిక చేసుకోవాలి. మీరు షేర్ చేయాలనుకుంటున్న ట్రాక్‌ని ఎంచుకోవాలి. షేర్ బట్‌ను ప్రెస్ చేసి దిగువన లేదంటే కుడివైపున కనిపించే షేర్ సింబల్‌ని క్లిక్ చేయాలి. ఇందులో వాట్సాప్‌ని ఎంపిక చేసుకొని.. ఇక్కడ షేరింగ్ ఆప్షన్స్ నుంచి వాట్సాప్‌ని ఎంపిక చేయాలి. వాట్సాప్ ఓపెన్ అయ్యాక మై స్టేటస్‌ని ఎంచుకొని.. అనంతరం పోస్ట్‌పై క్లిక్ చేయాలి. దాంతో మీకు ఇష్టమైన మ్యూజిక్ మీ స్టేటస్‌లోకి వెళ్తుంది. మీ కాంటాక్ట్ లిస్ట్‌లో ఉన్న వారందరూ మీ స్టేటస్‌ను వినేందుకు అవకాశం ఉంటుంది. ఎవరైనా మీ స్టేటస్ నుంచి మ్యూజిక్ వినొచ్చు. ఈ ఫీచర్ అందరికీ అందుబాటులో లేదని.. త్వరలోనూ యూజర్లందరికీ అందుబాటులోకి వస్తుందని స్పాటిఫై చెప్పింది. ప్రస్తుతం స్పాటిఫైలో ఆప్షన్ కనిపించకపోతే.. త్వరలో రానున్న అప్‌డేట్‌లో ఖచ్చితంగా అందుబాటులోకి వస్తుందని చెప్పింది.

# రూ.41,999కే ఎలక్ట్రిక్ స్కూటర్ లాంచ్!

మార్కెట్లో రకరకాల ఎలక్ట్రికల్ స్కూటర్లు అందుబాటులోకి వస్తున్నాయి. తక్కువ ధరల్లోనే ఎక్కువ రేంజ్‌ను అందించే ఎలక్ట్రిక్ స్కూటర్లు ఉన్నాయి. వీటిని ఈఎంఐలో తీసుకుంటే ప్రతి నెల తక్కువ ఈఎంఐలతో చెల్లించుకోవచ్చు. భారతదేశంలో ఎలక్ట్రిక్ వాహనాలు ప్రస్తుతం ప్రజాదరణ పొందుతున్నాయి. కొత్త ఈఓఎక్స్ జెడ్‌యూకెఐ స్కూటర్ తక్కువ ధర కలిగిన ఎలక్ట్రిక్ స్కూటర్. దీనికి డ్రైవింగ్ లైసెన్స్ అవసరం లేదు. దీని గరిష్ఠ వేగం గంటకు 25 కి.మీ. అందుకే లైసెన్స్ లేదా రిజిస్ట్రేషన్ అవసరం లేదు. కంపెనీ ప్రకారం, ఈ స్కూటర్ 40 నుండి 50 కిలోమీటర్ల మైలేజీని ఇస్తుంది. ఇది 48వి లిథియంఅయాన్ బ్యాటరీ, ఛార్జర్‌తో వస్తుంది. జుకీ స్కూటర్: బ్యాటరీ పూర్తిగా ఛార్జ్ కావడానికి 4 నుండి 6 గంటలు పడుతుంది. దీన్ని సులభంగా తీసి ఇంట్లోనే ఛార్జ్ చేసుకోవచ్చు. ఇది నీరు (ఐపి67), అగ్ని రక్షణతో వస్తుంది. బ్యాటరీ పూర్తిగా ఛార్జ్ అయినప్పుడు, పవర్ ఆటోమేటిక్‌గా ఆగిపోతుంది. ఇది విద్యుత్ వృధాను తగ్గిస్తుంది. స్కూటర్ మోటార్ రకం, నీటితో తడిసి దెబ్బతినే అవకాశం లేదు. మూడు డ్రైవింగ్ మోడ్‌లు ఉన్నాయి.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# మాస్కులు కూడా సరిపోవు

- ఢిల్లీ వాయు కాలుష్యంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన
- ఏక్యూఐ 400 దాటిన రాజధాని: శ్వాసకోశ సమస్యలు పెరుగుదల
- వర్చువల్ విచారణలను వినియోగించుకోండి
- జస్టిస్ పీఎస్ నరసింహ సూచన

న్యూఢిల్లీ

దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం మళ్లీ ప్రమాదకర స్థాయికి చేరి ప్రజల ఆరోగ్యాన్ని తీవ్రమైన ముప్పులోకి నెట్టింది. గాలి నాణ్యత సూచిక వరుసగా 400 దాటుతూ సీవియర్ కేటగిరీలో కొనసాగుతుండటంపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. “ప్రస్తుతం ఢిల్లీలోని గాలి పరిస్థితి అంత ప్రమాదకరం అయింది కాబట్టి సాధారణ మాస్కులు కూడా మనల్ని రక్షించలేవు” అని జస్టిస్ పీఎస్ నరసింహ వ్యాఖ్యానించారు. గత కొన్ని రోజులుగా పొగమంచు, దుమ్ము, పరిశ్రమల కాలుష్యం, వాహనాల ఉద్గారాలు, పంట అవశేషాల దహనం వంటి అంశాలు రాజధాని వాతావరణాన్ని మరింత విషపూరితంగా మార్చాయి. పాఠశాలల్లో పిల్లలకు శ్వాస సమస్యలు, వృద్ధుల్లో ఆస్థమా, బ్రోంకైటిస్ కేసులు పెరగటం వైద్యులను కూడా ఆందోళనకు గురిచేస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్య దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. వర్చువల్ విచారణ సౌకర్యం అందుబాటులో ఉన్నప్పటికీ కొందరు సీనియర్ న్యాయవాదులు ఇంకా కోర్టుకు స్వయంగా వస్తున్నారని జస్టిస్ నరసింహ ప్రశ్నించారు. “మీ వద్ద ఇప్పటికే వర్చువల్ సదుపాయం ఉంది... ఈ స్థాయి కాలుష్యంలో ఇంకా ఎందుకు కోర్టుకు వస్తున్నారు? గాలి ఇంత ప్రమాదకరంగా ఉన్నప్పుడు మీ ఆరోగ్యానికి ఇది హానికరం” అని ఆయన సూచించారు. కాలుష్యం తీవ్ర ప్రభావం చూపుతున్న సమయంలో అందరూ జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు.
ఈ సమస్యపై ప్రధాన న్యాయమూర్తితో సమగ్రంగా చర్చించి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు. ఇదే సమయంలో వాయు నాణ్యతా నిర్వహణ కమిషన్ కూడా అత్యవసర చర్యలుగా పారిశ్రామిక ఉద్గార నియంత్రణ, వాహన రాకపోకలపై పరిమితులు, నిర్మాణ పనుల నిలిపివేత వంటి ప్రాథమిక చర్యలు ప్రారంభించింది. ఇటువంటి తీవ్ర పరిస్థితుల్లో ఢిల్లీ వాతావరణంపై సుప్రీంకోర్టు చేసిన ఈ వ్యాఖ్యలు ప్రజల్లో అవగాహన పెంచడమే కాక, కాలుష్యం నియంత్రణకు ప్రభుత్వాలు మరింత కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని స్పష్టంగా సూచిస్తున్నాయి.





# భారత్–బోట్స్వానా వన్యప్రాణి సంరక్షణలో కొత్త అధ్యాయం

- మోకలోడి నేచర్ రిజర్వ్‌లో భారత–బోట్స్వానా నిపుణుల ఆధ్వర్యంలో చిరుతల విడుదల
- ప్రాజెక్ట్ చిరుత తదుపరి దశకు బోట్స్వానా నుంచి ఎనిమిది చిరుతల బహుకరణ
- రెండు దేశాల మధ్య పర్యావరణ, జంతుసంరక్షణ సహకారానికి బలమైన పురోగతి

భారత్-బోట్స్వానా వన్యప్రాణి సంరక్షణ సహకార చరిత్రలో మరొక ముఖ్య ఘట్టానికి బోట్స్వానాలోని మోకలోడి నేచర్ రిజర్వ్ వేదిక అయింది. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, బోట్స్వానా అధ్యక్షుడు దుమా గిడియన్ బోకో సమక్షంలో బోట్స్వానాలోని ఘాంజీ ప్రాంతానికి చెందిన చిరుతలను భారత-బోట్స్వానా నిపుణులు క్వారంటైన్ సౌకర్యాల్లో విజయవంతంగా విడుదల చేశారు. ప్రాజెక్ట్ చిరుత తదుపరి దశలో భాగంగా బోట్స్వానా భారత్‌కు ఎనిమిది చిరుతలను బహూకరించడం రెండు దేశాల మధ్య పెరుగుతున్న పర్యావరణ సహకారానికి ప్రతీకగా నిలిచింది. భారత్‌లో చిరుతల పునరావాసం, జనాభా పెంపు, అడవి-పర్యావరణ సమతుల్యత పునరుద్ధరణకు ఈ బహుకరణ ఎంతో దోహదపడనుంది.
చిరుతల రక్షణ, ఆరోగ్య పరిశీలన, కొత్త పర్యావరణ పరిస్థితులకు అలవాటు చేసే ప్రక్రియల్లో రెండు దేశాల నిపుణులు కలిసి పని చేయడం అంతర్జాతీయ వన్యప్రాణి సంరక్షణలో ఆదర్శంగా భావిస్తున్నారు. ముఖ్యంగా చిరుతల కోసం ప్రత్యేకంగా రూపొందించిన క్వారంటైన్ సదుపాయాల్లో శాస్త్రీయ పద్ధతులతో పరిశీలనలు జరగనున్నాయి. ఈ కార్యక్రమం ద్వారా భారత్-బోట్స్వానా ద్వైపాక్షిక సంబంధాలకు కొత్త ఉత్సాహం లభించడమే కాకుండా, భవిష్యత్‌లో వన్యప్రాణి పరిశోధన, కన్జర్వేషన్ ప్రాజెక్టుల్లో మరింత లోతైన సహకారం సాధ్యమవుతుందని అధికారులు భావిస్తున్నారు.





# ఎయిర్ ఇండియా విమానానికి బాంబు బెదిరింపు

- ముంబై–వారణాసి విమానాన్ని అత్యవసర ల్యాండింగ్
- 182 మంది ప్రయాణికులు క్షేమంగా బయటపడటం ఊరటనిచ్చింది

దేశంలో బాంబు బెదిరింపుల శృంఖల మరింత ఆందోళన కలిగిస్తున్న వేళ, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానానికి వచ్చిన తాజా బెదిరింపు అధికారులు అప్రమత్తం అయ్యేలా చేసింది. సాయంత్రం ముంబై నుంచి వారణాసికి వెళ్తున్న ఐఎక్స్ 1023 విమానానికి గాల్లో ప్రయాణిస్తున్న సమయంలోనే బాంబు బెదిరింపు సందేశం అందింది. అత్యవసర పరిస్థితుల్లో అనుసరించాల్సిన అన్ని భద్రతా నియమావళిని అమలు చేస్తూ పైలట్ వెంటనే ల్యాండింగ్‌కు సిద్ధమయ్యారు. వారణాసి విమానాశ్రయంలో విమానాన్ని సురక్షితంగా దిగారు. విమానంలో 182 మంది ప్రయాణికులు ఉన్నారని, వారందరూ క్షేమంగా ఉన్నారని అధికారులు వెల్లడించారు. ప్రయాణికుల్లో ఎవరికి చిన్నపాటి గాయాలు కూడా కాలేదని సమాచారం. విమానాన్ని ల్యాండ్ చేసిన వెంటనే బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, సీఐఎస్ ఎఫ్ భద్రతా బలగాలు గట్టిగా తనిఖీలు చేపట్టాయి. బాగేజీలు, కేబిన్, కార్గో సెక్షన్లను పూర్తిగా పరిశీలించిన అనంతరం ఏ అనుమానాస్పద వస్తువులు లభించలేదని అధికారులు తెలిపారు. అయినప్పటికీ బెదిరింపు సందేశం ఎలా వచ్చింది, దాని వెనుక ఉద్దేశ్యం ఏమిటన్న దానిపై దర్యాప్తు కొనసాగుతోంది. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు బెదిరింపు సందేశం పంపిన వ్యక్తిని గుర్తించేందుకు సాంకేతికంగా అన్ని కోణాల్లో విచారణ ప్రారంభించారు. ఇటీవల దేశంలో పలుచోట్ల బాంబు బెదిరింపులు పెరుగుతున్న నేపథ్యంలో విమానాశ్రయ భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలని కేంద్ర పౌర విమానయాన విభాగం అధికారులను ఇప్పటికే ఆదేశించిన విషయం తెలిసిందే. ప్రయాణికులు సురక్షితంగా బయటపడటం సంతోషకరమైనప్పటికీ, బెదిరింపు పట్ల అధికారులు ఇంకా అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

# డిమాపూర్ చేరుకున్న కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్

- నాగాలాండ్ సీఎం నెఫ్యూ రియో స్వయంగా ఆహ్వానం
- రాష్ట్ర మంత్రులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరు
- అధికారిక పర్యటనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు



కేంద్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి నిర్మలా సీతారామన్ డిమాపూర్ చేరుకున్న సందర్భంగా నాగాలాండ్ ముఖ్యమంత్రి నెఫ్యూ రియో ఘన స్వాగతం పలికారు. అధికారిక పర్యటనలో భాగంగా డిమాపూర్ విమానాశ్రయానికి చేరుకున్న సీతారామన్‌కు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఆతిథ్యాన్ని అందించింది. ఈ స్వాగత కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు టీఆర్ జెలియాంగ్, జాకబ్ జిమోమీ, పి. బషాంగ్‌మొంగ్బా చాంగ్ , అలాగే బీజేపీ నాగాలాండ్ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అభివృద్ధి, మౌలిక వసతులు, ఆర్థిక పురోగతి వంటి అంశాలపై చర్చలు జరగనున్నట్లు సమాచారం. సీతారామన్ పర్యటన నేపథ్యంగా రాష్ట్రం మొత్తం ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేయగా, డిమాపూర్ ప్రాంతంలో స్థానిక ప్రజలు కూడా భారీగా తరలివచ్చి ఆమెకు ఆత్మీయ ఆహ్వానం పలికారు. కేంద్రంతో సమన్వయం మరింత బలోపేతం అవుతుందన్న విశ్వాసం రాష్ట్ర ప్రభుత్వంలో కనిపించింది.




# భారత్–నేపాల్ రైలు వాణిజ్యానికి కొత్త ఊపు

- రెండు దేశాల మధ్య లెటర్ ఆఫ్ ఎక్స్ఛేంజ్ సంతకం
- బహుముఖ రవాణా–వాణిజ్య సంబంధాలకు మరింత బలం



భారత్ మరియు నేపాల్ మధ్య రైలు వాణిజ్య అనుసంధానాన్ని మరింత బలోపేతం చేసే కీలక ఒప్పందానికి శ్రీకారం చుట్టారు. భారత కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ద్వైపాక్షిక సమావేశంలో నేపాల్ పరిశ్రమ-వాణిజ్య-సప్లైస్ మంత్రి అనిల్ కుమార్ సిన్హాతో చర్చలు జరిపిన అనంతరం రెండు దేశాలు లెటర్ ఆఫ్ ఎక్స్ఛేంజ్కు సంతకాలు చేశారు. ఈ ఒప్పందంతో రైలు మార్గం ద్వారా సరకు రవాణా సౌకర్యాలు మరింత సులభతరం కానున్నాయి. ఇప్పటివరకు ఉన్న వాణిజ్య మార్గాలకు తోడు రైల్వే సరకు రవాణా వ్యవస్థను మెరుగుపరచడం ద్వారా రెండు దేశాల మధ్య ఆర్థిక, వాణిజ్య బంధాలు మరింత బలపడతాయని అధికారులు పేర్కొన్నారు. భారత్ నేపాల్ మధ్య బహుముఖ రవాణా వ్యవస్థ (మల్టీమోడల్ ట్రేడ్ కనెక్టివిటీ)ను అభివృద్ధి చేయడంలో ఈ ఒప్పందం కీలక దశగా భావిస్తున్నారు. రోడ్డు, రైలు, సరిహద్దు వాణిజ్య కేంద్రాల అభివృద్ధితో కలసి రైల్వే సరకు రవాణా పెరగడం వల్ల వ్యాపార వ్యయం తగ్గి, వాణిజ్య ప్రవాహం వేగవంతం అవుతుందని నిపుణుల అభిప్రాయం. ఇరుదేశాల మధ్య వాణిజ్య పరంగా ఉన్న బలమైన సంబంధాలు ఈ కొత్త అనుసంధానం ద్వారా మరింత విస్తరించనున్నాయని, ముఖ్యంగా వ్యవసాయ ఉత్పత్తులు, తయారీ ఉత్పత్తులు, పరిశ్రమల సరకు రవాణా వేగంగా సాగేందుకు ఇది మార్గం సుగమం చేస్తుందని అధికారులు తెలిపారు.



# బాణసంచా కర్మాగారంలో భారీ పేలుడు

- ఇద్దరు కార్మికుల మృతి, ఐదుగురికి గాయాలు
- భద్రతా ప్రమాణాల లోపమే కారణమని అనుమానం

ఉత్తరప్రదేశ్‌లోని బారాబంకి జిల్లాలో గురువారం మధ్యాహ్నం బాణసంచా కర్మాగారంలో భారీ పేలుడు సంభవించి ప్రాంతం అంతా ఒక్కసారిగా కల్లోలం నెలకొంది. పలు కిలోమీటర్ల దూరం వరకూ పేలుడు శబ్దం వినిపించడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఘటనలో ఇద్దరు వర్కర్లు మృతిచెందగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. పేలుడు జరిగిన వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకున్నారు. గాయపడిన కార్మికులను సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల వివరాలను అధికారులు ప్రకటన చేయడానికి సిద్ధమవుతున్నారు. ఈ బాణసంచా కర్మాగారానికి లైసెన్స్ ఉన్నప్పటికీ, భద్రతా ప్రమాణాల అమలులో నిర్లక్ష్యం చోటుచేసుకుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పేలుడు సమయంలో యజమాని ఖలీద్‌తో పాటు అతని సోదరుడు కూడా అక్కడే ఉండగా, వారు గాయపడ్డట్లు పోలీసులు తెలిపారు. నిర్వాహకుల అజాగ్రత్త, ప్రమాదకర పదార్థాల తగిన విధంగా నిర్వహణలో లోపాలే ప్రమాదానికి కారణమై ఉండొచ్చని ప్రాథమిక దర్యాప్తులో బయటపడుతోంది. సంఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు కొనసాగుతోంది. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ఫ్యాక్టరీలోని భద్రతా పరిస్థితులను పూర్తిగా సమీక్షించనున్నట్లు పోలీసులు వెల్లడించారు.



# ఢిల్లీ పేలుళ్లపై అనుచిత పోస్టులు అసోంలో 15 మంది అరెస్ట్

- విద్వేషాన్ని ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు
- హింసను కీర్తిస్తే ఉపేక్ష లేదు – సీఎం హిమంత బిశ్వ శర్మ హెచ్చరిక



దేశ రాజధాని ఢిల్లీలో ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు పేలుళ్లు దేశాన్ని కలచివేశాయి. 12 మంది ప్రాణాలు కోల్పోయిన ఈ దారుణ ఘటనపై దేశవ్యాప్తంగా తీవ్ర స్పందనలు వినిపిస్తున్న తరుణంలో, సోషల్ మీడియాలో కొందరు మాత్రం పేలుళ్లను కీర్తిస్తూ, అనుచితంగా, అవమానకరంగా పోస్టులు పెట్టారు. ఇటువంటి విద్వేషపూరిత వ్యాఖ్యలను అసోం ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి రాష్ట్రవ్యాప్తంగా 15 మందిని అరెస్టు చేసింది. సీఎం హిమంత బిశ్వ శర్మ స్వయంగా ఈ విషయాన్ని వెల్లడించారు. “ఢిల్లీ పేలుళ్లపై అవమానకర పోస్టులు పెట్టినందుకు ఇప్పటివరకు 15 మందిని అరెస్టు చేశాం. నిన్న రాత్రి మరో ఆరుగురిని అదుపులోకి తీసుకోగా మొత్తం సంఖ్య 15కు చేరింది” అని శర్మ ఎక్స్‌లో ప్రకటించారు. విద్వేషాన్ని, హింసను ప్రోత్సహించే ఏ చర్యనైనా అసోం పోలీసులు కఠినంగా ఎదుర్కోవాలని ఆయన స్పష్టం చేశారు. అరెస్టయిన వారిలో బొంగైగావ్‌కు చెందిన రఫీజుల్ అలీ, హైలకండికి చెందిన ఫరీదుద్దీన్ లస్కర్, లఖింపూర్ జిల్లా నివాసితులు ఇనాముల్ ఇస్లాం, ఫిరోజ్ అహ్మద్, బార్పేట్టాకు చెందిన షాహిల్ షోమన్ సిక్దార్, రకీబుల్ సుల్తాన్, హోజైకి చెందిన నసీమ్ అక్రమ్, కమ్రూప్‌కు చెందిన తస్లిమ్ అహ్మద్, దక్షిణ సల్మారాకు చెందిన అబ్దుర్ రోహిమ్ మొల్లా వంటి పేర్లను సీఎం వెల్లడించారు. దేశ భద్రతకు సంబంధించిన విషాదకర ఘటనలను కీర్తించడం, బాధితులను అవమానించే పోస్టులు పెట్టడం సమాజంలో విద్వేషం, అసహనం పెంచుతుందని హెచ్చరించిన సీఎం, ఇటువంటి చర్యలను ఏ విధంగానూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. “హింసను కీర్తిస్తే రాజీ లేదు... సమాజాన్ని రెచ్చగొట్టే వారిపై తీవ్రమైన చర్యలు తప్పవు” అని హితవు పలికారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in